Entered

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
నవంబర్ 14, 2010

ENTERED

పిల్లల రాజ్యం

కొత్తగూడెం బాలోత్సవ్‌కు 20 ఏళ్లు

హ్యాపీబర్త్‌డే

(2010 నవంబర్ 14 నుంచి 2010 నవంబర్ 20 వరకు)

జి. అజయ్
4సం॥, నవంబర్-17
సుమిత్ర-రమణ
విశాఖపట్నం

జె. బాలాజీ
1సం॥,నవంబర్-19
సుబ్బులు-వెంకటేశ్వర్లు
భగత్‌సింగ్‌నగర్-ప్రకాశం

ముస్కాన్
1సం॥,నవంబర్-2009
మొబైనా-ఆరిఫ్‌ఖాన్
రాయచోటి-కడప

జ్యోతిర్మయి
నవంబర్
నాగమణి-నాగభూషణం
రాజమండ్రి

కె. నందిని
నవంబర్
అరుణ-ఉపేందర్‌రావు
చిరుమర్రి-ఖమ్మం

ఆర్. హర్షిత
4సం॥,నవంబర్-16
శ్రీలక్ష్మి-సైదులు
రాంనగర్-హైదరాబాద్

బి. లక్ష్మీమౌనికశ్రీ
9సం॥,నవంబర్-18
రత్నరాణి-వెంకటకృష్ణారావు
పెనుగంచిప్రోలు-కృష్ణా

డి. శివదుర్గాప్రసాద్
నవంబర్-19
రాజేశ్వరి-రాజయ్య
డోర్నకల్-వరంగల్

ఎన్. రోహిత్
నవంబర్-2004
ప్రసన్న-శివాజీ
మార్టూరు-ప్రకాశం

వెంకటసుబ్బయ్యచౌదరి
9సం॥,నవంబర్-19
అన్నపూర్ణ-శ్రీనివాసరావు
వేమవరం-ప్రకాశం

టి. సాయి సాత్విక
నవంబర్
సరిత-రామగౌడ్
రాకాశిపేట-బోధన్

ఎ. సుదర్శిని
5సం॥,నవంబర్-2005
దాక్షాయణి-సుబ్రమణ్యం
పెనుమూరు-చిత్తూరు

డి. గణేష్
నవంబర్
ధనలక్ష్మి-రాములు
బాగ్‌లింగంపల్లి

బి. వైభవ్
1సం॥, నవంబర్-18
చంద్రకళ-శ్రీధర్
రామంతపూర్-హైదరాబాద్

వి.లిఖిత
4సం॥, నవంబర్-14
శోభ-రాజమౌళి
నంగునూరు-మెదక్

వి. కౌసర్
4సం॥,నవంబర్-16
జైనబ్-ఖాలక్‌వుద్దీన్
కపిలేశ్వరపురం-కృష్ణా

ENTERED

మనలో మాట

తివాచీ.. తివాచీ... ఎందుకు ఎగిరావూ?

అమెరికా అధ్యక్షుడు మన ఆర్థిక రాజధాని ముంబై నుంచి దేశ రాజధాని ఢిల్లీకి బయల్దేరబోతుంటే- విమానాశ్రయంలో పరిచిన ఎర్ర తివాచీ ఎగిరిపోయింది! ఒకటి కాదు, రెండు సార్లు అలా జరిగేసరికి, అధికారులు కంగుతిన్నారు. ఒబామా సమక్షంలో కూడా ఎర్ర తివాచీ ఇలా తిరుగుబాటు ధోరణి ప్రకటిస్తే- కొంప మునిగిపోతుందని భయపడి- దానిని మడిచేసి పక్కన పెట్టేశారు. అధ్యక్షుడు తివాచీ గౌరవం లేకుండానే విమానం ఎక్కేశాక- ఓ అధికారి విచారణ మొదలెట్టాడు!

'అంత పెద్ద దేశపు అధ్యక్షుడు నీ మేను మీంచి నడుస్తుంటే- పరవశించి, తరించిపోయే బదులు ఎందుకు ఎగిరిపోయావు?' అని తివాచీని ప్రశ్నించాడు.

'అవి పరవశించిపోవాల్సిన పాదాలు కాదు, పద ఘట్టనలు! కావలిస్తే ఇరాక్‌లోనో, ఆఫ్ఘనిస్తాన్లోనో ఆనవాళ్లు చూడండి. ఇక నేనెందుకు ఎగిరానూ అంటే- దేశం వీధివీధినా ఎలుగెత్తిన ఎర్రజెండాలకు సంఘీభావంగా.' అంది ఎర్ర తివాచీ.

'ఎర్రజెండాలు మాత్రం అధ్యక్షుడి రాకను ఎందుకు నిరసించాలీ?' అని అడిగాడు.

'పెత్తందారులాగ ప్రవర్తిస్తూ, ప్రపంచం మొత్తం తన గుప్పిట్లో ఉండాలనుకునే దేశాన్ని నిరసించకపోతే స్వాగతిస్తారా? మా ఇంటికొస్తే ఏం తెస్తావ్? మీ ఇంటికొస్తే ఏం ఇస్తావ్? అన్న మోతుబరి తత్వం అమెరికాది. 'దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్' అన్నాడు ఓ మహానుభావుడు. అమెరికా దృష్టిలో దేశమంటే మనుషులు కాదు, మార్కెట్! ఒబామా మాటల నిండా అలాంటి వ్యాపారతత్వమే ఉంది...' అంది తివాచీ.

'అయితే, ఒబామా పర్యటన వల్ల ఉపయోగమే లేదా?' అని అధికారి అడుగుతుంటే- ఆ పక్కనే ఉన్న ఓ చెప్పుల కంపెనీ సేల్స్‌మేన్ అందుకున్నాడు :

'నాకు మాత్రం చాలా ఉపయోగపడింది సార్. కస్టమర్‌ని బుట్టలో పడేయటానికి ఎలాంటి చిట్కాలు ప్రయోగించాలో తెలిసింది. వ్యాపారంలో పొగడ్త కూడా పెద్ద దినుసు అని అర్థమైంది. మన గురించి, మన సరుకు గురించి గొప్పలు చెప్పటం కన్నా కూడా వినియోగదారుడిని పొంగేయడం చాలా చాలా పెద్ద బిజినెస్ టెక్నిక్కు అని అర్థమైంది.' అన్నాడు సంబరపడిపోతూ.

అతడి మాటలను ఎలా అర్థం చేసుకోవాలో తెలీలేదు అధికారికి.

'ఒబామా మన చరిత్రనీ, సంస్కృతినీ, వైజ్ఞానిక ప్రతిభనీ చాలా చాలా పొగిడాడు కదా... మన గుర్రాలను, ఒంటెలను తన వెంట తీసుకుపోతానన్నాడు. తాను అధ్యక్షుణ్ణయిన తరువాత ఇన్ని రోజులు భారత్‌లో తప్ప ఇంకెక్కడా గడపలేదని, ఇది అనుకోకుండా జరుగుతున్నది కాదని, ఇది భారత్‌కు తామిస్తున్న ప్రాధాన్యమని... చాలా చాలా బాగా చెప్పాడు కదా...'

'అవునవును... అచ్చం బ్రిటీషు వ్యాపారులు భారతదేశంలోకి వచ్చినప్పుడు పొగిడిన పద్ధతిలోనే పొగిడాడు. మన గుర్రాలను, ఒంటెలను తన వెంట తీసుకుపోతానన్నాడు, మన ఐటి ఉద్యోగులను మాత్రం ఇంటికి పంపే బిల్లు సెనేట్‌లో పెట్టాడు. నెత్తిన పెట్టుకొని ఊరేగే వారుంటే ఇండియాలో నాలుగు రోజులేం ఖర్మ... శాశ్వతంగా ఇక్కడే ఉండిపోతాడు. బ్రిటీషు పాలకులు రెండొందల ఏళ్ల పాటు ఇక్కడ తిష్ట వేసిన చరిత్ర ఉండనే ఉంది కదా... దాదాపు వందేళ్లు పోరాడితే తప్ప ఆ గెస్టులను గెంటేయలేకపోయాం. మన ఆతిథ్యం అంటే వాళ్లకు అంతిష్టం మరి!' అంది ఎర్ర తివాచీ.

క్రమశిక్షణ ఉల్లంఘన, అధికార ధిక్కారం తదితర అభియోగాలతో ఎర్ర తివాచీపై ఏ చర్యలు తీసుకోవాలో ఆలోచించడం మొదలెట్టాడు ఆ సగటు భారత ఉన్నతాధికారి! ★

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	3
చిన్న కథ	...	7
కవిత్వమ్	...	8
కొత్త పుస్తకాలు	...	9
సీరియల్	...	10
చూద్దామా	...	12
అట్టమీది కథ	...	14
ఈ పేజ్	...	20
వికాసం	...	21
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

చెరగని ముద్ర వేసిన రాల్ఫ్ ఫాక్స్, ఫ్యూజిక్‌లు

... 6

గ్రంథాలయ స్ఫూర్తిదాతలు

కథ ... 18

వేచిన వేకువ



అన్నీ ఆసక్తికరం

ఈవారం స్నేహ అందంగా ఆకర్షణీయంగా ఉండే పేజీలతో మమ్మల్నెంతగానో ఆకట్టుకుంది. ముఖ్యంగా చెప్పాలంటే ప్రతి అంశము కూడా చాలా ఆసక్తిదాయకం. ఈ వారం కవిత్వమ్‌లో 'అడుగులు వేస్తూ...' కవిత మాకెంతగానో నచ్చింది. హృదయాన్ని హత్తుకునేట్లు ఉంది. వారం వారం సరికొత్త కవితలను మాకందిస్తున్న మీకు అభినందనలు. కవర్ స్టోరీకి సంబంధించిన 'దేశం నిండుగ దీపాల పండుగ' చాలా నచ్చింది. పండుగ విశిష్టత, ప్రాధాన్యతలకు సంబంధించి చక్కటి వివరణ ఇచ్చారు.

కొటాన రాము, విశాఖపట్నం.

అపురూపం 'అమ్మ'

ఆదివారం అనుబంధం సర్వం కన్నుల వెలుగులను పంచిన ఆనంద పర్వం. స్నేహ ఈ వారం మాకు ఎంతో నచ్చింది. స్ఫూర్తిలో 'అమ్మ ఆదర్శం' విశేషాలు చదివాం. మక్సీమ్ గోర్కీ అమ్మ పుస్తకం మరపురాని గ్రంథం. మనిషిగా పుట్టిన వారందరు ఎన్నడూ కాదనలేని అపురూప వస్తువు "అమ్మ". హ్యాట్సాఫ్‌టు మక్సీమ్ గోర్కీ. ఇంత మంచి పుస్తకం నుంచి స్ఫూర్తి పొందినందుకు నర్రా రాఘవరెడ్డి గారికి మా హృదయపూర్వక అభినందనలు. ఈ వారం అట్టమీదికథ దేశం నిండుగ దీపాల పండుగ గురించిన ప్రత్యేకవ్యాసం ఈసంచికకే వెలుగు నింపింది. పాఠకులకు ఆనందాలను పంచింది. ఈవారం రుచి తీపిని పంచింది. కిస్‌మిస్ కేసరి, చంద్రకాంత, జిలేబీ, చెనే లడ్డూ గురించి ఇవ్వడం బావుంది.

–సీతారామరావు, విజయవాడ.

అలరించిన పచ్చదనం

అణువణువునా పచ్చదనం విషయాలు అలరించాయి. మెట్టుపాళయం నుండి ఊటీ వరకు అటు –ఇటు అన్ని చోట్ల పచ్చదనంతో నిండిన అడవులను బస్సులో గాని రైలులోగాని ప్రయాణిస్తే కనబడే నీలగిరి సొగసులు చూడవలసినవే.

ఆచార్య నూతి నారాయణరావు,
గడ్డి అన్నారం, హైదరాబాద్.

హాస్యాన్ని చిందించిన దీపావళి కార్టూన్లు

దీపావళిపై అట్టమీది కథ సందర్భోచితంగా ఉంది. శేఖర్ గారి ఫుల్‌స్కేప్ కార్టూన్లు చాలా హాస్యాన్ని ఒలికించాయి. రజనీ అభిమానులకు నచ్చే రచన పీపీ వ్యాసం. ఈ పేజీ చాలా ప్రయోజనకరంగా ఉంటోంది. చూద్దామా ద్వారా ఊటీ అందాలను చూడగలిగాం. భయం కథ నచ్చింది. బాలనేస్తాలులో పెరిస్కోప్ తయారీ విధానం మెచ్చుకోలుగా ఉంది. కప్పలు – కోతి... బొమ్మల నీతికథ ద్వారా మన ఆనందం కోసం ఇతరులను బాధించరాదని అర్థమైంది. సీరియల్ వియత్నాం వీరుడు ఎన్‌గుయెన్ వాన్‌ట్రాయ్ ఆసక్తికరంగా కొనసాగుతోంది. మనలోమాట నిజమే. కుశలమే కదా! అన్న అప్యాయతతో కూడిన పలకరింపుకు వెలకట్టగలిగే స్నేహం ఉంటుందా? అనిపించింది.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

అభినందనలు

మక్సీం గోర్కీ 'అమ్మ' నవల రాసి ఇన్ని సంవత్సరాలైనప్పటికి ప్రజల గుండెల్లో నిలిచేవుంది. అమ్మ పాత్ర పోరాటానికి ప్రతీక. పావెల్‌ను తీర్చిదిద్దింది ఆమె. ఇరువురూ కమ్యూనిస్టు ఉద్యమకారులకు స్ఫూర్తిదాయకం. 1964లో సిపిఎం ఏర్పడిన నాటి నుండి 1966 వరకు చాలా మంది మార్క్సిస్టులకు జైళ్లే నివాసాలుగా మారి తీవ్ర నిర్బంధం చవిచూసినప్పుడు వారికి పుస్తకాలే తోడు. అమ్మ నవల, కమ్యూనిస్టు ప్రణాళిక, మంచి కమ్యూనిస్టు ఎలా వుండాలి?, అక్టోబర్ విప్లవం, చైనా చరిత్ర చదివేవారు. ఉద్యమకారులకు పోరాట భావజాలంతో కూడిన పుస్తకాలే మానసిక ఆయుధం. సిద్ధాంత ఆయుధం లేకుండా ఉద్యమాలు ముందుకు సాగవు. అమ్మ నవలను పరిచయం చేసినందుకు కామ్రేడ్ నర్రా రాఘవరెడ్డి గార్కి అభినందనలు.

టి. శ్రీరామమూర్తి, గాజువాక
విశాఖ,

దీపావళి సమగ్ర సమాచారం

31.10.2010 స్నేహలో కవర్ స్టోరీ 'దేశం నిండా దీపాల పండుగ' అంటూ దీపావళి గురించి చక్కని, సమగ్ర సమాచారం అందించారు. ఈ సంచికలో శేఖర్ కార్టూన్లు నవ్వులు కురిపించాయి.



విజయాల వేటలో రూటు మార్చిన రజనీ వ్యాసంలో రజనీకాంత్ అగ్రనటుడిగా ఎదిగిన తీరు చక్కగా వివరించారు. ఒకనాటి బాలచందర్ శిష్యుడిగా ఈనాడు భారతదేశంలోనే అత్యధిక పారితోషికం, అత్యధిక అభిమానులను కలిగిన నటుడు రజనీకాంత్. ఎంత ఎదిగినా నిరంతరం ఒదిగి ఉండే అతని వ్యక్తిత్వమే రజనీని అగ్రస్థానానికి చేర్చింది. 'అమ్మ' గ్రంథం గురించి పార్టీ సీనియర్ నేత నర్రా రాఘవరెడ్డిగారు చెప్పిన విషయాలు ఆసక్తికరంగా ఉన్నాయి. అనువాద కథ 'భయం' ఎంతో బాగుంది. చివరిపేజీలో కప్పలు–కోతి బొమ్మల కథ చాలా బాగుంది. అలాగే 'వాచిపోయే రేటు అంటూ వాచీలకు సంబంధించిన సమాచారం చాలా బాగుంది.

మార్పూరు అజయ్‌కుమార్,
చిలకలూరిపేట, గుంటూరు.

కథలకు ఆహ్వానం

మన చుట్టూ అనేక సంఘటనలు జరుగుతుంటాయి. వీటిలో ఎన్నో సంఘటనలు మనసును మెలిపెడుతుంటాయి. అవి సామాజికమైనవి కావచ్చు. ఆర్థికమైనవి కావచ్చు. మరేవైనా కావచ్చు. వాటిని ప్రతిబింబించే... బాధితులను చైతన్యపరిచే... సామాజిక స్పృహ కలిగించే... కథలను మాకు పంపండి. ప్రచురిస్తాం. పారితోషికం వుంటుంది. అయితే తెల్లకాగితం మీద ఒకవైపు మాత్రమే రాయాలి. రాతలో ఏడు కాగితాలకు మించకూడదని మనవి.

మా చిరునామా:
కథ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

అరటిపువ్వు - పెసరపప్పు కూర

కావలసిన వస్తువులు

అరటిపువ్వు - 1, పెసరపప్పు - 1 కప్పు
పెద్ద ఉల్లిపాయలు -2, నూనె - చిన్న నేతిగిన్నె
అల్లం ముక్క - 1 అంగుళం
ఉప్పు - తగినంత
పచ్చిమిరపకాయలు - 6
పోపు సామాను - కరివేపాకు

తయారు చేసే విధానము

పెసరపప్పు నానబెట్టుకోవాలి. అరటిపువ్వు దొప్పలు తీస్తే లోన చిన్నచిన్న కాయలు ఉంటాయి. వాటిని విడదీస్తే పుల్లలు లాంటివి, ఒక తెల్లని చిన్న దొప్పు ఉంటాయి. ఆ దొప్పును, పుల్ల లాటి దానిలో ఒక పుల్లకు చివర బుడిపలాగా ఉంటుంది. ఆ పుల్లను వేరిపారేసుకోవాలి. చివరకు పుల్లలు విడదీయటానికి వీలులేకుండా ఉంటాయి. దానికి తలకాయలు తీసివేస్తే చాలు. ఇవి అన్నీ వేరు చేసిన తరువాత ఈ కాయలను కచ్చాపచ్చాగా దంచి కొంచెం నీరు పోసి కడిగి, మరల కొంచెం నీరు పోసి పొయ్యిమీద పెట్టాలి. ఇవి కాస్త ఉడికిన తరువాత కొంచెం ఉప్పు వేసి మరల కొంచెం సేపైన తరువాత దించి చిల్లుల గిన్నెలో వేసిగాని, గిన్నెకు మూతవేసి వంచిగానీ పక్కన పెట్టుకోవాలి. నీరంతా పోయి పొడిగా వస్తుంది. నానబెట్టిన పెసరపప్పు, ఉడికించిన అరటిపువ్వు కలిపి పోపు పెట్టుకోవాలి.



అరటి పువ్వు కొబ్బరితో

కావలసిన వస్తువులు

అరటిపువ్వు - 1, అల్లం 1 అంగుళం ముక్క
కొబ్బరి- పచ్చిది 1 చిప్ప, ఉప్పు - సరిపడా
ఉల్లిపాయలు- పెద్దవి 2
నూనె - నేతి గిన్నెడు
పచ్చిమిరపకాయలు - 10
పోపుసామాను - కరివేపాకు

తయారు చేసే విధానం

అరటి పువ్వు ముందు కూరలోలాగానే బాగుచేసి కచ్చాపచ్చాగా కొట్టి పెట్టుకొని కొంచెం నీళ్ళుపోసి కడిగి పెట్టుకోవాలి. దానిని మరలా కొంచెం నీళ్ళు పోసి ఒక పొంగు వచ్చేవరకు ఉడికించి చిల్లుల పళ్ళెంలోగాని, మూతవేసి గాని నీళ్ళన్నీ వార్చి పక్కన పెట్టుకోవాలి. ఉల్లిపాయలు చిన్న ముక్కలుగా తరిగి పెట్టుకోవాలి. తరువాత కొబ్బరి, పచ్చిమిర్చి, అల్లం, ఉప్పు వేసి నూరి పెట్టుకోవాలి.

పొయ్యి మీద బాండీ పెట్టి నూనె పోసి కాగిన తరువాత పోపు వేసి, కరివేపాకు కూడా వేసి ఉల్లిముక్కలు వేయాలి. ఇవి కొంచెము వేగిన తరువాత అరటి పువ్వుముద్దను వేసి వేయించండి. తరువాత నూరి పెట్టుకున్న కొబ్బరి ముద్దను వేసి బాగా వేయించి తీసుకోవాలి.



అరటిదూట - పప్పుతో

కావలసిన వస్తువులు

అరటి దూట - 1 జానెడు ముక్క
పచ్చిమిర్చి - 10 కాయలు, నూనె - పెద్ద గరిటెడు, పెసరపప్పు - చిన్న కప్పు, పోపు సామాను - కరివేపాకు, పెద్ద ఉల్లిపాయ - 1
ఉప్పు - తగినంత, అల్లం - 1 అంగుళం ముక్క

తయారు చేసే విధానం

అరటి దూటను మందంగా పైపెచ్చు తీసి చిన్నచిన్న చక్రాలుగా కోయాలి. దాని పీచు వేలుకు చుట్టుకుంటూ లాగితే పీచంతా వస్తుంది. అప్పుడు దానిని చిన్న చిన్న ముక్కలు తరిగి నీళ్ళలో వేసుకోవాలి. ఈ ముక్కలు ఒక పొంగు వచ్చేవరకు కొంచెం ఉప్పు వేసి ఉడికించుకోవాలి. ముందుగా పెసరపప్పు నానబెట్టి పెట్టుకోవాలి. ఇవి చిల్లుల గరిటలోగాని, మూతవేసి గానీ వార్చి పెట్టుకోవాలి. ఉల్లిపాయ, పచ్చిమిర్చి, అల్లం సన్నగా ముక్కలు చేసి పెట్టుకోవాలి.

బాండీలో నూనె వేసి కాగనివ్వాలి. తరువాత పోపు వేసి కరివేపాకు ఉల్లిముక్కలు వేసి కొంచెం వేగనివ్వాలి. అరటి దూట ముక్కలు వేసి కొంచెం వేగిన తరువాత పెసరపప్పు అల్లం, మిర్చి ముక్కలు వేసి కాస్త వేగిన తరువాత మెత్తటి ఉప్పుడేసి వేయించుకోవాలి. ఇది కాస్త ఎర్రగా వేగితే బాగుంటుంది.

అరటి దూట - ఆవతో

కావలసిన వస్తువులు

అరటి దూట - జానెడు, యెండు మిర్చి - 2
శనగ పప్పు - టేబుల్ స్పూను, చింత పండు - చిన్న నిమ్మకాయంత, చాయ మినపప్పు - టేబుల్ స్పూను, కరివేపాకు - 3 రెమ్మలు, యెండు కారం - 1/2 స్పూను, నూనె - చిన్న నేతి గిన్నెడు, ఆవాలు - 1/2 స్పూను, ఉప్పు - తగినంత, పసుపు - చిటికెడు

తయారు చేసే విధానం

అరటిదూటను పైకూరలో మాదిరిగానే ముక్కలు చేసుకొని ఉప్పు, పసుపు వేసి వార్చి పెట్టుకోవాలి. బాండీలో నూనెవేసి కాగిన తరువాత యెండు మిర్చి ముక్కలుచేసి వేయాలి. అవి కాస్త వేగిన తరువాత శనగపప్పు, మినపప్పు, ఆవాలు వేసి చిటపటలాడనిచ్చి కరివేపాకు అరటిదూట ముక్కలు వేయాలి. ఇలా నిముషము వేగనిచ్చి చింతపండు పులుసు చిక్కగా (చింతపండు కొంచెం నీళ్ళుపోసి పొయ్యిమీద వేడిచేస్తే పులుసు చిక్కగా వస్తుంది) పిండాలి. ఇష్టమయిన వాళ్ళు కొంచెం బెల్లం కూడా వేసుకోవచ్చు. 5 నిముషాలు వేగిన తరువాత దించాలి. చల్లారిన తరువాత ఒక స్పూను ఆవాలు ఒక్క చుక్క నీళ్ళతో మెత్తగా నూరి కూరలో కలుపుకోవాలి.



స్ఫూర్తి

కామ్రేడ్ లావు బాల గంగాధరరావు

చెరగని ముద్ర వేసిన రాల్ఫ్ ఫాక్స్, ఫ్యూజిక్‌లు

నన్ను బాగా కదిలించిన, నడిపించిన పుస్తకాలలో అతి ముఖ్యమైంది జ్యూలియస్ ఫ్యూజిక్ 'రక్తాక్షరాలు'. ప్రపంచ వ్యాపితంగా ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో కమ్యూనిస్టులు చేసిన త్యాగాలకు సాహసానికి ఈ పుస్తకం ప్రతీక అని చెప్పొచ్చు. ఒక విధంగా అది మా కుటుంబానికే ఉత్తేజమిచ్చింది. హిట్లర్ ఫాసిస్టు శక్తులు జెకోస్లవేకియాను హస్తగతం చేసుకుని కమ్యూనిస్టులపై పూచకోత చిత్రహింసలు సాగిస్తున్న కాలంలో అలాంటి ఒక చిత్రహింసా శిబిరంలో చిక్కిన ఫ్యూజిక్ రాసిన ప్రతి అక్షరమూ అచంచల సాహసానికి అద్దం పడుతుంది. పాత్రికేయుడైన ఫ్యూజిక్ ఒక గార్డు అందించిన పెన్సిల్ కారణంగానే ఆ మృత్యుకుహరంలోంచి మహత్తరమైన ఈ రచన చేయగలిగాడు. భయానకమైన ఆ వాతావరణాన్ని వర్ణిస్తూనే చెక్కుచెదరని విశ్వాసాన్ని ప్రతి పంక్తిలో మనకు అందిస్తాడు. కమ్యూనిస్టులు నిర్బంధాలకు, నీచత్వాలకు లొంగిపోయే వారు కాదని ఫాసిస్టుల మొహం మీద చెప్పగలిగిన చేవ ఉర్రూతలూపింది. పైగా మేము కూడా ఫాసిస్టు యుద్ధానికి వ్యతిరేకంగా పోరాడటం, తర్వాత కాలంలో అజ్ఞాతవాసం, చిత్రహింసలు, జైలు జీవితాలు అన్నీ చూస్తున్న కాలం గనక మనం కూడా అలాగే నిలబడాలన్న దీక్షను ద్విగుణీకృతం చేసేవి. 1947లో అజ్ఞాతవాస కాలంలోనే సరోజినితో నా వివాహం జరిగింది. అంతుపట్టని ఆందోళన, ఉత్కంఠలతో నిండిన జీవితం. అయినా సరోజిని బాధపడకుండా ధైర్యంగానూ గర్వంగానూ నిలబడింది.



కమ్యూనిస్టు భావాలవైపు ఆకర్షితుడనవుతున్న దశలో నన్ను అమితంగా ప్రభావితం చేసిన పుస్తకాలు కొన్ని వున్నాయి. వాటిలో మొట్టమొదట చెప్పుకోవలసింది రాల్ఫ్ ఫాక్స్ రచనలను.

1937లో గుంటూరు ఏసి కాలేజీలో ఇంటర్మీడియట్ చదివే రోజుల్లో నాకు కమ్యూనిస్టు ఉద్యమంతో పరిచయం కలిగింది. ఆ ఏడాది కొత్తపట్నం రాజకీయ పాఠశాలకు హాజరైనప్పుడే ఉద్యమ బీజాలు నాటుకున్నాయి. బ్రిటిష్ ప్రభుత్వం ఆ పాఠశాలను అర్ధాంతరంగా నిషేధించి దమనకాండ సాగించడంతో 11 రోజులకే ముగిసింది.(తర్వాత చాలా కాలానికి 1986లో అక్కడే రాష్ట్ర నాయకత్వ పాఠశాల జరిపాము) ఆ మరుసటి ఏడాది పార్టీ సభ్యుడినయ్యాను. ఆ రోజుల్లో ఏసి కాలేజీ భావి కమ్యూనిస్టు నాయకులందరికీ నిలయంగా వుండేది. మాకినేని బసవపున్నయ్య మోటూరు హనుమంతరావు, కొరటాల సత్యనారాయణ, వైవి కృష్ణారావు వంటివారంతా వుండేవారు. నిజానికి నేనూ రాజకీయాల కోసమే కాలేజీలో చేరుతున్నానని మా నాన్న కోప్పడ్డారు. తర్వాత ఆయన కూడా పార్టీ అభిమానిగా మారి తన అనుభవాలు ప్రజాశక్తిలో రాశారు.

నేనూ రాజకీయాలలో మునిగి తేలుతూ పరీక్ష తప్పి ఏడాది పోయింది. మళ్లీ బిఏలో అక్కడే చేరాను. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన నర్రా ఆంజనేయులు నా రూమ్ మేట్. తనను నిర్బంధ కాలంలో పోలీసులు కాల్చిచంపారు. అప్పట్లోనే నాపైనా అరెస్టు వారంటు జారీ అయింది. 1940-41లో గుంటూరు జిల్లా విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శిగా పనిచేశాను. 1942 వరకూ అజ్ఞాత వాసంలోనే వుండి పనిచేయాల్సి వచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం కమ్యూనిస్టుపార్టీపై నిషేధం ఎత్తివేయడంతో బహిరంగంగా పనిచేసే అవకాశం కలిగింది. విద్యార్థి ఉద్యమంలో అనుభవం రీత్యా నన్ను జిల్లా కేంద్రంలో పనిచేయవలసిందిగా పిలిపించారు. అప్పట్లో రాల్ఫ్ ఫాక్స్ రచించిన 'సోషలిజం, లెనిన్ జీవితం' వంటి పుస్తకాలు నా చేతికి వచ్చాయి. ఇచ్చింది ఉద్యమ సహచరుడు, తోటి హోల్ టైమర్ మునిపల్లె రామారావు. ఆయన నిరాడంబరత, అధ్యయనం నన్ను బాగా ప్రభావితం చేశాయి. ఆయన ఇచ్చిన ఆ పుస్తకాలు కూడా నన్ను బాగా ఆకట్టుకున్నాయి.

1900 లో పుట్టిన రాల్ఫ్ ఫాక్స్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు మాలాగే విద్యార్థి ఉద్యమం వైపు ఆకర్షితుడవడం అందుకొక కారణం కావచ్చు. అక్కడే ఆయన లామ్‌రింగ్‌టన్‌కు సన్నిహితుడయ్యాడు. లేబర్ క్లబ్‌లో సభ్యులయ్యారు. 1917లో సోవియట్ విప్లవం ప్రాధాన్యతను గొప్పగా గుర్తించారు. దాన్ని చక్రబంధంలో ఇరికించిన సామ్రాజ్యవాద దేశాల కుట్రను ఖండిస్తూ హ్యాండ్సాఫ్ రష్యా(రష్యాను వదిలేయండి) అన్న చిన్న పుస్తకం రాశాడు. 1920 జులైలో ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ గ్రేట్ బ్రిటన్(సిపిజిబి)లో సభ్యుడయ్యాడు. ఆయన మేధా శక్తి అందరినీ ముగ్ధులను చేసేది. కేవలం మేధాపరమైన నిబద్ధత వల్లనే ఆయన ఉద్యమానికి అంకితమైనాడని సిపిజిబి నాయకుడు హ్యారీ పాలిట్ రాశాడు. ఆయన రచనలు వేలాది మంది కార్యకర్తలకు ఉత్తేజమిచ్చాయని కూడా

అన్నాడు. బహుశా నేను కూడా ఆ కారణంగానే ఆకర్షితుడై వుంటాను. రాల్ఫ్ ఫాక్స్ తర్వాత కాలంలో స్వయంగా సోవియట్ వెళ్లి సమ సమాజ నిర్మాణాన్ని ప్రత్యక్షంగా చూశాడు. ఒక దశలో మార్క్సిజం లెనినిజం సంస్థ గ్రంథాలయ బాధ్యతలు చూశాడు.తిరిగి వచ్చాక డైలీ వర్కర్ పత్రికలో నిరంతరం రాస్తూ వచ్చాడు. నాడు ప్రపంచమంతటా ప్రగతిశీల వాదులను కదిలించిన స్పెయిన్ అంతర్యుద్ధంలో పాల్గొనేందుకు వెళ్లి బ్రిటిష్ బ్రిగేడ్‌కు నాయకత్వం వహిస్తూ 1937లో విప్లవ ప్రతీఘాతశక్తుల చేతిలో హతుడయ్యాడు.

రాల్ఫ్ ఫాక్స్ రాసిన 'మార్క్సిజం మాడ్రన్ థాట్' పుస్తకం చాలా విలువైంది. సోషలిజం అనేది కేవలం శుష్క నినాదం కాదని సాధించడానికి వీలైన ఆశయమని అందులో దృఢంగా చెబుతాడు. సోవియట్‌లో విప్లవ విజయం, సోషలిజం నిర్మాణం అందుకు నిదర్శనమంటాడు. లెనిన్ మార్క్స్ బోధలను దారి తప్పించాడన్న విమర్శలను తోసిపుచ్చుతూ మార్క్సిజం జడపదార్థం కాదని, నిర్దిష్ట పరిస్థితులను దాన్ని అన్వయించడమే లెనిన్ ఔన్నత్యమని రాల్ఫ్ ఫాక్స్ సైద్ధాంతికంగా నిరూపించాడు. లెనిన్ జీవితంపై మరో పుస్తకం రాశాడు. ఆయన రాసిన నవల 'ప్రజలు' అన్న పుస్తకం ప్రపంచమంతటా నవలా రచయితలకు కరదీపికగా మారిపోయింది.ప్రతి రచనా ఒక దేశకాల పరిస్థితుల నేపథ్యంలోంచే వస్తుందని భావజాలానికి ప్రాతినిధ్యం వహిస్తుందని ఆయన ప్రతిభావంతంగా విశ్లేషించాడు.

నన్ను బాగా కదిలించిన నడిపించిన పుస్తకాలలో అతి ముఖ్యమైంది జ్యూలియస్ ఫ్యూజిక్ 'రక్తాక్షరాలు'. ప్రపంచ వ్యాపితంగా ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో కమ్యూనిస్టులు చేసిన త్యాగాలకు, సాహసానికి ఈ పుస్తకం ప్రతీక అని చెప్పొచ్చు. ఒక విధంగా అది మా కుటుంబానికే ఉత్తేజమిచ్చింది. హిట్లర్ ఫాసిస్టు శక్తులు జెకోస్లవేకియాను హస్తగతం చేసుకుని కమ్యూనిస్టులపై పూచకోత చిత్రహింసలు సాగిస్తున్న కాలంలో అలాంటి ఒక చిత్రహింసా శిబిరంలో చిక్కిన ఫ్యూజిక్ రాసిన ప్రతి అక్షరమూ అచంచల సాహసానికి అద్దం పడుతుంది. పాత్రికేయుడైన ఫ్యూజిక్ ఒక గార్డు అందించిన పెన్సిల్ కారణంగానే ఆ మృత్యుకుహరంలోంచి మహత్తరమైన ఈ రచన చేయగలిగాడు. భయానకమైన ఆ వాతావరణాన్ని వర్ణిస్తూనే చెక్కుచెదరని విశ్వాసాన్ని ప్రతి పంక్తిలో మనకు అందిస్తాడు. కమ్యూనిస్టులు నిర్బంధాలకు, నీచత్వాలకు లొంగిపోయే వారు కాదని ఫాసిస్టుల మొహం మీద చెప్పగలిగిన చేవ ఉర్రూతలూపింది. పైగా మేము కూడా ఫాసిస్టు యుద్ధానికి వ్యతిరేకంగా పోరాడటం, తర్వాత కాలంలో అజ్ఞాతవాసం, చిత్రహింసలు, జైలు జీవితాలు అన్నీ చూస్తున్న కాలం గనక మనం కూడా అలాగే నిలబడాలన్న దీక్షను ద్విగుణీకృతం చేసేవి.

1947లో అజ్ఞాతవాస కాలంలోనే సరోజినితో నా వివాహం జరిగింది. అంతుపట్టని ఆందోళన, ఉత్కంఠలతో నిండిన జీవితం. అయినా సరోజిని బాధపడకుండా ధైర్యంగానూ గర్వంగానూ నిలబడింది. ఫ్యూజిక్ రక్తాక్షరాలు ఆమె ఆ రోజుల్లో ప్రత్యేకంగా చదువుతుండేది. దాంతోపాటే లెనిన్ అజ్ఞాత జీవితానికి సంబంధించిన విప్లవ గాథలు రెండవ ప్రపంచ యుద్ధంలో సోవియట్ వీరగాథలు కూడా స్థయిర్యం నిలబెట్టడానికి ఎంతగానో దోహదం చేశాయని మాటల మధ్య చెబుతుంటారు. ఫ్యూజిక్ 'రక్తాక్షరాలు' ఆయన భార్య అగస్టినా ప్రచురించింది, నిజానికి భర్తకు మరణ శిక్ష వేశారన్న సమాచారం తెలిసినప్పుడు ఆమె కూడా జైలులోనే వున్నారు. 1943 సెప్టెంబరు 8న జూలియస్‌ను ఉరితీశారు. 1945 మే నెలలో హిట్లర్ కుక్క చావుచచ్చిన తర్వాత ఫాసిస్టులు చంపడానికి వీలులేక వదలిపెట్టిన ఖైదీలంతా బయటకు రాగలిగారు. అలా వచ్చిన వారిలో అగస్టినా ఒకరు. జూలియస్ ఫ్యూజిక్ జీవితంలో ఇది కట్టకడపటి అధ్యాయం అంటూ ఆమె రాసిన ముందుమాట నుంచి మిత్రులారా నిరంతరం మిమ్ములనే ప్రేమిస్తా. జాగ్రత్తగా వుండండంటూ ఫ్యూజిక్ రాసిన ఆఖరి అక్షరాల వరకూ ప్రతిదీ మనను కదిలించేదే. 1986లో నేను సరోజిని జెకోస్లవేకియా వెళ్లినపుడు జెక్ కమ్యూనిస్టుల త్యాగాలను, సాహసాలను విని మరింత ఆశ్చర్య పోయాము. వాటిని గురించి ఇప్పటికీ ప్రపంచానికి తెలిసింది తక్కువే.

నన్ను బాగా ఆకట్టుకున్న మరో పుస్తకం ఇల్యా ఎహ్రెన్ బర్గ్ రాసిన 'స్టామ్' (పెను తుఫాను) నవల. చాలా పెద్దది. రెండవ ప్రపంచ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొని త్యాగాలు చేసిన యువ వీరులు వారి ఆశయ బలంతో పాటు మానవ సంబంధాలు, మానసిక ఘర్షణలు వంటివాటిని అమోఘంగా చిత్రించిన ఈ నవల రచయితలకు మార్గదర్శకంగా వుంటుంది.

ఇవన్నీ గాక వియత్నాం విప్లవ నేత హోచిమన్ జీవితం, రచనలు నాకు చాలా ప్రేరణనిచ్చాయి.అందుకే ఆయన జీవిత కథను అనువదించాను. తెలుగులో వచ్చిన అభ్యుదయ సాహిత్యంలో ఆణిముత్యాల వంటి నవలలన్ని చదివాను. ఉద్యమాల్లో పనిచేసేవారికి పుస్తకాలు ఎంతో ఉత్సాహం ఇవ్వడమే గాక అగ్నిపరీక్షల మధ్య నిలబెడతాయని కూడా 'రక్తాక్షరాలు' వంటివి నిరూపించాయి. తెలుగులో 'రథచక్రాలు' వంటి గొప్ప నవల రాసిన మహీధర రామ్మోహనరావు వంటివారికి జీవితంలో ఉద్యమం నుంచి ఉత్తేజం పొందలేకపోవడం నేను గమనించాను. జూలియస్ ఫ్యూజిక్, రాల్ఫ్ పాక్స్ వంటివారు ఈ విషయంలో పూర్తి భిన్నమైన ఆదర్శాన్ని నెలకొల్పారు.

(జీవిత కథ, ఇంటర్వ్యూల నుంచి)

రాల్ఫ్ ఫాక్స్ రాసిన 'మార్క్సిజం మాడ్రన్ థాట్' పుస్తకం చాలా విలువైంది. సోషలిజం అనేది కేవలం శుష్క నినాదం కాదని సాధించడానికి వీలైన ఆశయమని అందులో దృఢంగా చెబుతాడు. సోవియట్‌లో విప్లవ విజయం, సోషలిజం నిర్మాణం అందుకు నిదర్శనమంటాడు. లెనిన్ మార్క్స్ బోధలను దారి తప్పించాడన్న విమర్శలను తోసిపుచ్చుతూ మార్క్సిజం జడపదార్థం కాదని, నిర్దిష్ట పరిస్థితులను దాన్ని అన్వయించడమే లెనిన్ ఔన్నత్యమని రాల్ఫ్ ఫాక్స్ సైద్ధాంతికంగా నిరూపించాడు. లెనిన్ జీవితంపై మరో పుస్తకం రాశాడు. ఆయన రాసిన నవల ప్రజలు అన్న పుస్తకం ప్రపంచమంతటా నవలా రచయితలకు కరదీపికగా మారిపోయింది.ప్రతి రచనా ఒక దేశకాల పరిస్థితుల నేపథ్యంలోంచే వస్తుందని భావజాలానికి ప్రాతినిధ్యం వహిస్తుందని ఆయన ప్రతిభావంతంగా విశ్లేషించాడు.

గ్రంథాలయోద్యమ స్ఫూర్తిదాతలు...

దుర్గాబాయ్ దేశముఖ్



అయ్యదేవర కాళేశ్వరరావు

భారత స్వాతంత్రోద్యమానికి గ్రంథాలయోద్యమం వెన్నుదన్నుగా నిలిచింది. గ్రంథాలయోద్యమ ఆవశ్యకతను గుర్తించి ఎందరెందరో మహానుభావులు తమ జీవితాలను ఆ ఉద్యమానికి అంకితం చేశారు. విశిష్ట సేవలందించారు. వీరికి గ్రంథాలయోద్యమ నిర్మాతలుగానూ, కార్యకర్తలుగానూ ప్రజలు అత్యంత తోడ్పాటునందించారు. అటువంటి కృషీవలుర గురించి ...



అయ్యంకి వెంకటరమణయ్య



సురవరం ప్రతాపరెడ్డి

గ్రంథాలయోద్యమ ఆరంభ దినాలలో గ్రంథాలయ కార్యకర్తల విధులను గురించి తృతీయ ఆంధ్రదేశ గ్రంథాలయ మహాసభ (1916)లో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు ఇలా వివరించారు. "గ్రంథాలయముల ప్రతినిధులు కార్యశూరులుగాని వాక్శూరులుగారు. స్వయం సహాయావలంబులుగాని వేదనావలంబులుగారు. త్యాగపరులుగాని స్వార్థపరులుగారు. సేవానిరతులుగాని లాభార్థులుగారు. వ్యగ్రోత్సాహభరితులైన యువజనులుగాని సుస్థిరవృతులైన స్థలిరులుగారు. మాతృభాషాభిమానులుగాని మాతృభాషా నిరపేక్షకులుగారు".

జాతీయోద్యమ కాలంలోనే గ్రంథాలయోద్యమానికి పటిష్టమైన పునాది నేర్పరచి ప్రగతి పథంలో పయనింపజేశారెందరో. పట్టణాలలోనే కాక గ్రామాలలో కూడా గ్రంథాలయాలు ఏర్పరచారు. అవి క్రియాశీలంగా పనిచేసేందుకు ఆంధ్రప్రదేశ్‌లో ఎందరో పట్టుదలతో కృషి చేశారు. వారిలో అయ్యంకి వెంకటరమణయ్య (తూర్పు గోదావరి జిల్లా), అక్కిపెద్ది హరినాథ్ (అనంతపురం జిల్లా), అయ్యదేవర కాళేశ్వరరావు (కృష్ణాజిల్లా), ఆదిరాజు వీరభద్రరావు (ఖమ్మం జిల్లా), అడుసుమిల్లి శ్రీనివాసరావు (ప్రకాశం జిల్లా), వావిలాల గోపాల కృష్ణయ్య (గుంటూరు జిల్లా), కోదాటి నారాయణరావు (నల్గొండ జిల్లా), గాడిచర్ల హరిసర్వోత్తమరావు (కడప జిల్లా), జయంతి కామేశ్వరరావు (విజయనరగం జిల్లా), శ్రీమతి దుర్గాబాయ్ దేశముఖ్, పురిపండా అప్పలస్వామి (శ్రీకాకుళం జిల్లా), మహీధర రామ్మోహనరావు (తూర్పుగోదావరి జిల్లా), సురవరం ప్రతాపరెడ్డి (మహబూబ్ నగర్ జిల్లా), వట్టికోట ఆళ్వారు స్వామి (కరీంనగర్ జిల్లా)... ప్రథమ శ్రేణిలోని వారిగా పేర్కొనాలి.

గ్రంథాలయ వారోత్సవాలు
నవంబర్ 14-21

అలా ప్రథమశ్రేణిలోనే పేర్కొనవలసిన వారిలో ఒకరైన శ్రీమతి సూర్యదేవర రాజ్యలక్ష్మీదేవి 1913వ సంవత్సరంలో స్వాతంత్ర్య సమరవీరులకు, విద్యావంతులకు పేరుగన్న కృష్ణాజిల్లా, నందిగామ తాలుకాలోని వీరుల పాడులో జన్మించారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. జైలుకు వెళ్ళారు. 16 సంవత్సరాల వయసులోనే తమ స్వగ్రామమైన వీరులపాడులో రామమందిరం అనే గ్రంథాలయాన్ని నిర్వహించారు. ఆ గ్రంథాలయానికి కొన్ని పుస్తకాలు దానం ఇచ్చారు.

1932లో జైలు నుండి విడుదలై వచ్చాక సూర్యదేవర నరసయ్యగారి తల్లి శ్రీమతి వీరమాంబగారి స్మృత్యర్థం మహిళలకోసం ఒక గ్రంథాలయాన్ని స్థాపించారు. ఆ గ్రంథాలయ పాలకవర్గానికి కార్యదర్శిగా పని చేశారు. ప్రజానీకానికి సంబంధించి అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు.

తెలుగు వారంతా ఏకమైన "విశాలాంధ్ర" స్థాపనకోసం తన మకాం హైదరాబాదుకు మార్చి "తెలుగుదేశం" వారపత్రిక ప్రారంభించారు. ఆ పత్రికకు వారే సంపాదకులు, ప్రచురణకర్త, ముద్రాపకులు. ఈ పత్రికపరంగా గూడా గ్రంథాలయోద్యమాన్ని ప్రోత్సహించారు.

తన దగ్గరున్న అపార పుస్తక సంపదను అనేక గ్రంథాలయాలకు, తెలుగు పత్రిక సంపుటాలను హైదరాబాద్ శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్రభాషా నిలయానికి దానంగా ఇచ్చారు.

రాజ్యలక్ష్మీదేవిగారు 1949 నుంచీ ఆంధ్ర ప్రదేశ్ గ్రంథాలయ సంఘంతో సన్నిహిత సంబంధం పెట్టుకున్నారు. కొంతకాలం సహాయ కార్యదర్శిగా, సంయుక్త కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షురాలుగా అనేక పదవులలో సేవచేశారు. సంఘకార్యక్రమాలకు ఎంతో అండగా ఉన్నారు.

రాజ్యలక్ష్మీదేవిగారు పదవిలో ఉన్నా లేకపోయినా సాటివారికి సాయం చేయడం, ఎవరికీ కష్టం కలుగకుండా వ్యవహరించడం వారికే చేతనయిందన్నంత పేరుగాంచారు.

నవభారత నిర్మాణాన్ని ఆకాంక్షించిన మనదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పుట్టిన తేదీ అయిన నవంబర్ 14 ప్రారంభరోజుగా నవంబర్ 21వ తేదీ చివరి రోజుగా గత 42 సంవత్సరాల నుండి మనదేశంలో గ్రంథాలయ వారోత్సవాలు జాతీయంగా నిర్వహించబడుతున్నాయి. ఇప్పుడు జరగబోయేవి 43వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు.

కాని దేశంలో ప్రైవేటీకరణ విధానాలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చిన, ఇస్తున్న పాలకుల విధానాల వలన గ్రంథాలయ వారోత్సవాలకు కనీసమైన ప్రాధాన్యత కూడా నివ్వటం లేదనేది ఈ వారోత్సవాలు జరుగుతున్న పద్ధతులను పరిశీలిస్తే అర్థమవుతుంది. నామమాత్రమైన నిధులను మాత్రమే గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతున్నాయి. రాజకీయాలకు అతీతంగా గ్రంథాలయాలను అభివృద్ధి చేసుకొనవలసిన అవసరం ఎంతైనా వుంది. సామాజిక చైతన్యానికి, వ్యక్తి చైతన్యానికి గ్రంథ పఠనావశ్యకత ఎంతైనా అవసరం.

- ఎస్. సూర్యకుమార్

చిన్న కథ

తప్పెవరిది?

"సత్యా!"

"ఆఁ మమ్మీ, చదువుకుంటున్నా!"

"నువ్వు చదువుతున్నావని నాకు తెలుసుగాని, ఆ టేబుల్ మీద రెండు న్యూస్ పేపర్లు పెట్టాను చూడు.. ఒకటి 'విద్య'. రెండోది 'చదువు' అని వుంటాయి. పరీక్షల్లో అవి కూడా బాగా ఉపయోగపడ్తాయని, సరస్వతి పిన్ని చెప్పింది. వింటున్నావా?" అంది సత్య తల్లి తులసి.

"వింటున్నా మమ్మీ! అన్నీ చదువుతాను, నువ్వేమీ బెంగ పెట్టుకోకు" అంది విసుగ్గా సత్య.

తులసికి, ఆనందరావుకి ముగ్గురు మగపిల్లలు, ఒక ఆడపిల్ల. అందరిలోకి ఆడపిల్ల సత్య పెద్దది. అనంత్, సురేష్, సంపత్ తదుపరి సంతానం ఆ తల్లిదండ్రులకి. పులిని చూసి నక్క వాత పెట్టుకున్న చందం పనులు బాగా ఆసక్తిగా చేస్తుంది తులసి. తమ బంధువుల పిల్లలంతా, మెడిసిన్, ఇంజనీరింగ్ చేస్తున్నారు. కనుక, తన పిల్లల్ని కూడా అలాంటి చదువు చదివించాలని సాధారణ తల్లిగా ఆమె ఆశ. ఇది జనం వింటే ఆమెది 'అత్యాశ' అంటారు. కారణం ఆనందరావు సిరి– సంపదలు.

ఆనందరావుకు తల్లిదండ్రుల ద్వారా చెప్పుకోదగ్గ సిరిగాని, సంపదగాని ప్రాప్తించలేదు. ఇతర పేద కుటుంబాల మాదిరిగా తమ పిల్లలని, పాలేర్లుగా పని మనుషులగా పంపించకుండా చాతనయినంత మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత చదువు చెప్పించగలిగాడు ఆనందరావు తండ్రి పేరయ్య. ఎప్పుడయినా ఎవరయినా, 'నీ తండ్రి నీకు ఏమిచ్చాడు గనక?' అని ప్రశ్నిస్తే.

"చదువుకోనిచ్చాడు." అని రక్కున సమాధానం చెబుతాడు ఆనందరావు.

ఆ రకంగా ఇంటర్మీడియట్ క్వాలిఫికేషన్ సంపాదించాడు ఆనందరావు. ప్రైవేటు దుకాణంలో పద్దులు రాసే పనికి కుదిరి ఏదో సంసారాన్ని అతికష్టంగా లాగిస్తున్న ఆనందరావుకి భార్య కోర్కెలు తీర్చడం అతి సవాలుగా మారింది. అందుకే తులసి పట్టుమీద, ఆమె దగ్గర ఉన్న ఒకటి అర బంగారు ఆభరణాలు అమ్మి నాలుగు డబ్బులు ఎక్కువ సంపాదించాలన్న ఆశతో మిత్రుల ద్వారా దుబాయ్ చేరుకున్నాడు. అక్కడ ఓ హమాలి ఉద్యోగం సంపాదించి, అనుకున్నదానికంటే ఎక్కువగానే డబ్బు పంపించి భార్యను తృప్తి పరుస్తున్నాడు ఆనందరావు.

★★★

ఆనందరావు దుబాయ్ వెళ్లే సమయానికి సత్య పదవతరగతి చదువుతోంది. ఆమె పెద్ద తెలివయిందేమీ కాదు. ఎవరేజ్ స్టుడెంట్ అని ఉపాధ్యాయులు అంటుండగా తులసి చాలా సార్లు

"తల్లీ! డాడి, మనందరికోసం, అంతదూరం వెళ్ళి కష్టపడుతున్నారు. అది అర్ధం చేసుకుని మీరు చదవాలి."
"చదువుతున్నాను మమ్మీ! మీ ఆశలకు అనుగుణంగానే కష్టపడ్తున్నాను. కాని.."
"ఆ ఏంటమ్మా చెప్పు!" అంది అందోళనగా తులసి.
"ఏమీ లేదు. నాకంతా తికమకగా ఉంది మమ్మీ! క్లాసులో పాఠాలు చదవకపోతే, లెక్చరర్లు వూరుకోవడం లేదు. ట్యూషన్లో పాఠాలు చదవకపోతే, అక్కడ తలెత్తుకోవడానికి సిగ్గుపడాల్సివస్తుంది. నువ్వు చెప్పినట్లు చదవకపోతే.. నువ్వు బాధపడ్తావు. ఇన్ని సమస్యల మధ్య నా చదువు ఎటువైపు పోతుందో తెలియడంలేదు మమ్మీ!" అంది తడి కమ్ముకున్న కళ్ళను తుడుచుకుంటూ.
"లేదమ్మా! ఇందులో గాబరా పడాల్సిన అవసరం లేదు. నీకు ఎలా తేలిక అన్పిస్తే అలానే చదువు తల్లీ" అని బుజ్జగించింది తులసి.

వింది. నిజానికి సత్య పదోతరగతి పాసవుతుందని కూడా వాళ్ళు అనుకోలేదు. కాస్త అధికంగా పరిశ్రమించడంతో, పాస్ కావడమేకాదు, ఫస్ట్‌క్లాస్ తెచ్చుకుంది. ఇక తులసిని ఆపడం ఎవరితరం కాలేదు. సత్యను బయాలజి గ్రూప్‌తో ఇంటర్ చేర్పించింది. ఎందుకయినా మంచిదని ట్యూషన్ కూడా పెట్టించింది. అతికష్టం మీద సాధారణ మార్కులుతో ఇంటర్ మొదటి సంవత్సరం పాస్ అయింది సత్య. తులసి గుండెల్లో గుబులు మొదలయింది. కూతురు కంటే తల్లికి టెన్షన్ ఎక్కువయింది. అందుకే తనకు తోచినవి, ఇతరులు చెప్పినవి రకరకాల సలహాలతో కూతురి మెదడు తినేయడం మొదలు పెట్టింది.

ఆనందరావు భార్య తులసికి రాసే ప్రతి ఉత్తరంలోను, చదువు పేరుతో, పిల్లలను చిత్రహింసలు పెట్టొద్దని అలాచేస్తే క్రమంగా మెదడు మొద్దుబారిపోయి మొదటికి మోసం వస్తుందని హెచ్చరిస్తుంటాడు.

★★★

"సత్యా"

"అ మమ్మీ!.. చదువుతున్నాను మమ్మీ!!"

ఎప్పుడు పిలిచినా, ఇలాంటి జవాబే రావడంతో, కూతురి ఆరోగ్య పరిస్థితి మీద అనుమానం వచ్చింది తులసికి.

"తల్లీ! డాడి, మనందరికోసం, అంతదూరం వెళ్ళి కష్టపడుతున్నారు. అది అర్ధం చేసుకుని మీరు చదవాలి."

"చదువుతున్నాను మమ్మీ! మీ ఆశలకు అనుగుణంగానే కష్టపడ్తున్నాను. కాని.."

"ఆ ఏంటమ్మా చెప్పు!" అంది అందోళనగా తులసి.

"ఏమీ లేదు. నాకంతా తికమకగా ఉంది మమ్మీ! క్లాసులో పాఠాలు చదవకపోతే, లెక్చరర్లు వూరుకోవడం లేదు. ట్యూషన్లో పాఠాలు చదవకపోతే, అక్కడ తలెత్తుకోవడానికి సిగ్గుపడాల్సివస్తుంది. నువ్వు చెప్పినట్లు చదవకపోతే.. నువ్వు బాధపడ్తావు. ఇన్ని సమస్యల మధ్య నా చదువు ఎటువైపు పోతుందో తెలియడంలేదు మమ్మీ!" అంది తడి కమ్ముకున్న కళ్ళను తుడుచుకుంటూ.

"లేదమ్మా! ఇందులో గాబరా పడాల్సిన అవసరం లేదు. నీకు ఎలా తేలిక అన్పిస్తే అలానే చదువు తల్లీ" అని బుజ్జగించింది తులసి.

★★★

రెండో సంవత్సరం ఇంటర్ పరీక్షలు పూర్తికావడం, ఆ తదుపరి ఫలితాలు కూడా రావడం జరిగింది. సత్య ఫలితం కోసం స్టేట్ ర్యాంకుల దగ్గర నుంచి నంబరు వెతకడం ప్రారంభించింది తులసి. థార్డ్ ర్యాంక్ ఫలితాలు కూడా అయిపోయినాయి. వాటిల్లో కూడా సత్య నంబరు లేకపోవడంతో, నల్లగా మాడి పోయింది తులసి ముఖం.

తలెత్తి తల్లి ముఖం చూసేందుకు ధైర్యం చాలడంలేదు సత్యకు. 'ఈ నేరం నాదికాదు' అన్నట్లుగా తల దించుకుని తల్లికి దూరంగా వెళ్ళిపోయింది సత్య. అయోమయంగా, కూతురి వంక బిత్తర చూపులు చూస్తూ అలా నేల మీద కూలబడింది తులసి.

- డా॥ కె.ఎల్.వి.ప్రసాద్

కవిత్వమ్

రేపటి పౌరులు

భావి భారత పౌరులారా...
నవ సమాజ నిర్మాతలారా...
సమసమాజ శక్తులారా...
నవయుగ వైతాళికులారా...
చీకటి గర్భాన్ని చీల్చే పిడుగులారా...
నవ ఉషస్సును తెచ్చే రేపటి పౌరులారా...
పదం కలిపి... భుజం కలిపి...
గళం కలిపి... కదం తొక్కి...
ఒక్కరుగా... ఒక్కటిగా...
విస్ఫులింగాల్లా... విచ్చు కత్తుల్లా...
కణ కణ మండే...
ఉక్కు కణికల్లా... అగ్నిశిఖల్లా...
కదలండి... కదలిరండి...
అల్లూరికి వారసుల్లా...
భగత్‌సింగ్‌కు ప్రతీకల్లా...
అమెరికా సామ్రాజ్యవాద ఉక్కు పిడికిలిని
బద్దలుగొట్టి భరతమాతను పరిరక్షించే...
రేపటి పౌరులం మేమేనంటూ...
ఎలుగెత్తి చాటండి!
కొదమ సింగాలై గర్జించండి!!
తెగబడుతున్న సామ్రాజ్యవాదం...
ఉధృతమౌతున్న ఉగ్రవాదం...

తెగిస్తున్న తీవ్రవాదం...
మదించిన మతమౌఢ్యం...
అవినీతి పెనుభూతం...
ఈ పంచభూతాల సాక్షిగా...
విషపు కోరల్లో భారతదేశం!
ఐఎంఎఫ్., డబ్ల్యుటిఓ., ప్రపంచబ్యాంకుల వల...
సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ...
పేరేదైతేనేం...? బతుకంతా పరాయీకరణే!
సామాన్యుని నిలువుదోపిడీకి ముప్పేట దాడి!!

పరిశ్రమల్లో శ్రామిక రుధిరం...
సాధించిన త్యాగఫలం...
సిగ్గువిడిచి ప్రయివేటుపరం!
ప్రభువుల నయా ఉదారవాదం...
అన్నిరంగాల అంగాంగాలూ సంస్కరణలమయం!
రూపాలేవైతేనేం...?
బక్కవాడికి బతుకే పరిహాసం!
అప్పుచేసినా పప్పుకూడు భారం...
పరిహరిస్తోంది 'సూక్ష్మ' రాక్షసం!
ఎన్నాళ్ళూ...ఎన్నేళ్ళూ...?
ఇంకానా...ఇంకానా...?
కదలండి... కదలిరండి...
నిద్రావస్థలో ఉన్న జాతిని జాగృతం చేసేందుకు...
దేశీయ మేధో పరిరక్షణకు...
సర్వ శ్రామిక శ్రేణుల్లో -
చైతన్య జ్వాలలు రగిలించేందుకు...
సమసమాజ స్థాపనకు...
వేనవేల గొంతుకలు ఒక్కటై -
దిక్కులు పిక్కటిల్లేలా గర్జించండి!
ఈ నరమేధానికి చరమగీతం పాడండి!!
రేపటి పౌరుల్లారా...
స్వర్ణ భారత ఆశాజ్యోతులారా...
మన కీర్తి పతాక రెపరెపలను
వినువీధుల్లో ఎగరేయండి!!!

-పి.వి.రమణ

ఉద్దానం గుండె చప్పుడు



బీడుభూములు కావవి బీల భూములు (నీటిక్షేత్రాలు)
బడుగుల బ్రతుకుకు ఆలంబనలు
పర్యావరణానికి పట్టుగొమ్మలు
పంట పొలాలకు అమృత గుళికలు
అభివృద్ధి మంత్రంతో వాటిపై పడ్డాయి రాజకీయ నాయకుల కళ్ళు
బీల భూములను బీడు భూములని
మసిపూసి మారేడుకాయ చేయడానికి ఎన్నో ప్రయత్నాలు
పేదల గుండె చప్పుడు వినిపించుకోని అధికారగణం
ఉద్దానం పచ్చదనంపై ఉక్కుపాదం
థర్మల్ బూడిదతో పర్యావరణాన్ని వెక్కిరించే ప్రయత్నం
స్వార్థమే రాజ్యమేలిన క్షణం
కరెన్సీనోట్లతో ఎరవేసే ప్రయత్నం
కళ్ళు తెరవని కపట రాజకీయం
బీదప్రజల బ్రతుకు పోరాటం
సముద్ర జలాలు కలుషితమయ్యే ప్రమాదం
పచ్చని సీమను భవిష్యత్ తరాలకు అందించాలనే ఆశయం
ఎదురొడ్డి నిలిచిన మత్స్యకార , రైతాంగ జనం
ఖాకీలు కర్కశత్వంగా విరుచుకుపడిన క్షణం
ప్రాణాలే ఫణంగా పెట్టి పోరాడిన సామాన్య రైతుజనం
తుపాకీ గొట్టానికి ఎదురొడ్డి నిలిచిన ప్రభంజనం
మానవత్వం మంటగలిసిన వేళ
పచ్చనోటుకు సలాం చేసిన అధికారం
కళ్ళావేళ్ళాపడినా కనికరించని వైనం
థర్మల్ భూతం పంజా విసిరిన వేళ
పచ్చటి సీమపై నెత్తుటి చారిక
నిదురమేల్కొని ప్రజాస్వామ్యం
నిదురలేని రాత్రులు గడుపుతున్న సామాన్యజనం
ఇప్పటికైనా వినిపించ లేదా.... ఉద్దానం గుండెచప్పుడు

- మొర్రి గోపి

కొత్త పుస్తకాలు

మానవీయుడు మావో...

రచన: క్వాన్‌యాంచి

తెలుగుసేత : కె.సత్యరంజన్

'Mao Zedong Man, Not God'

ప్రథమ ముద్రణ : ఫిబ్రవరి 2010

వెల : రూ.75/-

ప్రతులకు

ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

మానవీయుడే

మావో అంగరక్షకుడు లీ చెప్పిన విషయాల్ని అతను చెపుతున్నట్లుగానే రచయిత క్వాన్‌యాంచి చేసిన ప్రయోగం 'Mao Zedong Man, Not God' పుస్తకానికి జీవం పోసినట్లైంది. దీన్ని తెలుగులో అందరికీ అర్థమయ్యే భాషలో, దృశ్యాలు చెదరకుండా మనకందించిన అనువాదకులు కె.సత్యరంజన్ అభినందనీయులు. మావో గురించిన సత్యాలు తెలుసుకోవాలన్న ఆసక్తి ఉన్నవారందరికీ ఈ పుస్తకం సంతృప్తిని కలిగిస్తుంది. చరిత్రలో నిలిచిపోయిన మహనీయుల గురించిన కొన్ని విషయాలే బయటకు వెల్లడవుతాయి. అవీ వారి జీవితంలో ఒక పార్శ్వాన్ని మాత్రమే తెలియచేస్తాయి. అలాగే కొందరు తమ గురించి బయటకు తెలపడానికి ఇష్టపడరు. కానీ మహనీయులు తమ తదనంతరమైనా తమ గురించిన పూర్తి వివరాలు వెల్లడించడం వల్ల ముందుతరాలకు ఉపయోగమే కానీ, నష్టమేమాత్రం ఉండదు. ఈ రోజు మావో గురించిన విషయాలు తెలుసుకుంటున్నామంటే ఆయన ముందుచూపే కారణమనిపిస్తోంది. తన అంగరక్షకునితో ఆయన చెప్పిన మాటలు దాన్నే వెల్లడిస్తున్నాయి. 'నా కుటుంబంలో జరిగిన విషయాలు ఇతరులకు రహస్యాలు. కానీ నీకు కాదు. నేను చనిపోయేవరకూ నా గురించి ఏమీ రాయవద్దు. ఆ తర్వాత రాయదలుచుకుంటే వాస్తవాలనే రాయి' అని మావో తన అంగరక్షకుడు 'లీ'కి చెప్పిన మాటలు ఆయన ముందుచూపును వెల్లడిస్తున్నాయి. అందులోనూ వాస్తవాలను రాయమని నొక్కి చెప్పటం ఆయన చిత్తశుద్ధిని తెలియజేస్తుంది. ప్రచురించిన ఫొటోలూ బాగున్నాయి. ఇక పుస్తకంలోకి వెళితే రచయిత దీన్ని 20 అంశాలుగా విభజించి రచించారు. ప్రతి ఒక్కటీ మావోని ప్రతిబింబించాయి అంటే అతిశయోక్తి కాదు.

మొదటి అంశమైన 'నేను మావో అంగరక్షకుడిని ఎలా అయ్యాను?' లో 'మావో ఒక మాట అన్నాడంటే అది జరిగి తీరాల్సిందే. అంత తేలిగ్గా తను అన్న మాట నుండి వెనక్కి తగ్గడు. ఓ పట్టాన మనస్సు మార్చుకోడు' అన్న లీ మాటలు.. తన నియామకంలో మావో వ్యవహరించిన తీరుని, అతని ఖచ్చితత్వాన్ని తెలియజేస్తుంది. 'ఎవరెంత నిష్ఠగా ప్రార్థన చేసినా ప్రజల కష్టాలూ కడగండ్లూ మత విశ్వాసాలతో తీరేవి కావు' అని లీకి మావో చెప్పిన సమాధానం మతం పట్ల ఆయన వైఖరిని స్పష్టం చేస్తుంది. 'ఇక్కడ నువ్వొక విషయం అర్థం చేసుకోవాలి. ఇక్కడ ఎవరికి ఎవరూ నౌకర్లూ చాకర్లూ కారు. మనమంతా ప్రజలకు సేవకులం, విప్లవానికి సేవకులం. నువ్వు నాకు సాయంగా ఉండడం కూడా ఇందులో భాగమే' అని లీతో మావో చెప్పిన మాటలు విప్లవపార్టీల్లో పనిచేసేవారికీ పార్లమెంటరీ భ్రమలు ఉండకూడదని చెప్పడమే. 'ఇంకేం చెప్పొద్దు. నేను ఇచ్చిన మాట మీద నిలబడతాను. నువ్వు వెళ్లిపోవచ్చు' అని లీతో చేసుకున్న ఒడంబడికపై మావో సమాధానం అతని నిబద్ధతను తెలియజేస్తుంది. 'అతి సామాన్యంగా కనిపించే ఆయనలో నిబిడీకృతమై ఉన్న అపారమైన మేధస్సు, గొప్ప మానసిక స్థైర్యం, చరిత్రను నిర్మించగల సత్తాను గ్రహించాను. ప్రజల హృదయాలను కొల్లగొట్టాడు మావో. మావో వ్యక్తిత్వం నన్ను కట్టిపడేసింది. జీవితాంతం మావో దగ్గరే పని చెయ్యాలనే నిర్ణయానికి వచ్చా. ఆ ప్రకారమే ఇష్టపూర్వకంగా మావో దగ్గర పనిచేస్తా' అన్న లీ మాటలు ఓ కార్యకర్తను అంకితభావంతో పనిచేయించేలా సంకల్పాన్ని రగిలించగలిగే మావో నాయకత్వ పటిమను మన కళ్ల ముందుంచుతుంది.

ఇంకా ఈ పుస్తకంలో మావో గురించి లీ చెప్పిన మరికొన్ని వాస్తవాలు.. ఆయన మాటల్లోనే.. "మావో తన బిడ్డల పట్ల ఎంత ప్రేమ చూపేవారో అంతే కఠినంగానూ ఉండేవారు. అది ఆయన ఆదర్శాన్ని వెల్లడిస్తుంది. ఆయన నిరంతర అధ్యయనశీలి, ఆయనకు పుస్తకాలంటే అపారప్రేమ. మావోకు మిరియాలన్నా, పందిమాంసం అన్నా ఎంతో ఇష్టం. తనపై వచ్చిన విష ప్రచారాన్ని చేతల్లో తిప్పి కొట్టిన ధీశాలి.. నిరాడంబరుడు. 'నీలో ఇంకా బూర్జువా దర్పం పోలేదు' అని భార్య గురించి మావో చేసిన వ్యాఖ్యలు ఆయన వర్గదృష్టిని తెలుపుతుంది. 'నాకన్నా అథార్టీగా రాసిన వాళ్ళ పుస్తకాలు ఉన్నాయి అవి చదవండి. వాటిల్లో మార్క్స్-లెనిన్ రాసిన పుస్తకాలు ప్రత్యేకంగా చదవండి' అంటూ మావో భవితకు మార్గనిర్దేశం చేసేవాడు. తైవాన్‌ను చైనాలో కలపలేకపోయానని మావో బాధపడేవాడు. అది తన తీరని కలని అంటుండేవాడు.."

ఇలా మావో గురించిన ఎన్నో సత్యాలు తెలుసుకోవాలంటే.. ఈ పుస్తకం చదివి తీరాల్సిందే.

-శాంతిశ్రీ



మధుశాల

కవిత

డా॥దేవరాజు మహారాజు

వెల : 50/-,

పేజీలు :62

ప్రతులకు :

విశాలాంధ్ర, ప్రజాశక్తి,

నవోదయ బుక్‌హౌస్‌లు.



ముంగిట ముత్యాలు

తెలుగు బాల వెలుగు కిరణాలు

శ్రీమతి భమిడిపాటి

బాలా త్రిపురసుందరి

వెల : 100/-,

పేజీలు :104

ప్రతులకు :

శ్రీమతి భమిడిపాటి

బాలా త్రిపురసుందరి

57-14-24, న్యూ పోస్టల్ కాలనీ

రోడ్ నెం.1, వివి రావు స్ట్రీట్

పటమట, విజయవాడ-520010



సీరియల్

జరిగినకథ:

కుయేన్ తన భర్త ట్రాయ్ గురించి తోటి మహిళా ఖైదీలకు చెప్పుంటుంది. అతను పసితనంలోనే తల్లిని కోల్పోవడం, ఫ్రెంచి వారి చేతుల్లో చిక్కిన తండ్రి తప్పించుకొని పారిపోవడం... పెద్దన్నయ్య, వదినల దగ్గర పెరగడం.. అమ్మానాన్నల ప్రేమ దొరక్కపోవడం...అన్నీ ఆమె మాటల్లో దొర్లుతాయి. అయితే పుట్టెడు సంతానం, పేదరికంతో అల్లాడే అన్నావదినలను వదిలి ట్రాయ్ సైగాన్ వెళతాడు. అక్కడ రిక్షా నడుపుతుంటాడు. తద్వారా వచ్చే ఆదాయం అతని తిండికి కూడా సరిపోయేదికాదు. దాంతో ఓ కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా అప్రెంటిస్ పనికి కుదురుతాడు. ఈ పరిస్థితుల్లో అతనికి ప్రేయసిగా కుయేన్ లభించినందుకు ఎంతో సంతోషపడతాడు. అయితే ట్రాయ్ గురించి మరిన్ని వివరాలు చెప్పడానికి కుయేన్ సిగ్గుపడుతుంది. తోటి ఖైదీలు ఆమెను సమాధానపరిచి మరిన్ని విషయాలు చెప్పమంటారు. గొప్ప కామ్రేడ్ల జీవితాలు, పోరాటాల గురించి చెప్పడం వల్ల అనేక విధాల చిత్రహింసలకు గురౌతున్న వారికి మరింత ఉత్తేజం, ప్రోత్సాహం కలుగుతాయంటారు. తర్వాత పోలీసులను కలుసుకోవాలని కుయేన్‌కు తాకీదు అందడంతో వెళుతుంది. అప్పుడు...

వియత్నాం వీరుడు
ఎన్‌గుయెన్ వాన్ ట్రాయ్

(ఏడో భాగం)

కథనం: ఫాన్-థి-కుయేన్

అనువాదం: పాటూరి రామయ్య

ఆయన చెప్పబోతుండగా పోలీసులు వచ్చి నన్ను దూరంగా గెంటివేయడానికి ప్రయత్నించారు. ట్రాయ్ చేయి నా భుజాన్ని పట్టి లాగుతూనే వుంది.

ఒక దుర్మార్గుడు వచ్చి ఒక తోపు తోసి నన్నవతలకి లాగివేశాడు.

ట్రాయ్‌తో వాడిలా అన్నాడు.

'నేరాన్ని ఒప్పుకో, లేదా ఇంతకు ముందు ఎక్కడ చిత్రహింసలకు గురయ్యావో ఆ జనరల్ పోలీసు డిపార్టుమెంటుకి తీసుకెళతాను. ఈ చిత్రహింసలనే నీవు కోరుకుంటావా?"

ట్రాయ్ ఇలా జవాబిచ్చాడు.

"నేను ఏ నేరం చేయలేదు. కాని ఒకటి మాత్రం నిజం. సమారాను హతమార్చడానికి యత్నించాను. కాని నా దీక్ష నెరవేరలేదు".

"నీవు అంగీకరించకపోతే నిన్ను ప్రత్యేకించి చూడవలసి వస్తుంది. అలా జరిగినప్పుడు మమ్మల్ని నిందించవద్దు. నీవు నిక్కచ్చిగా నేరాన్ని అంగీకరించాలి. లేదా నీ భార్య జైల్లో కుమిలిపోతుంది సుమా?"

ట్రాయ్ అతని వైపు సవాల్ చేస్తున్నట్లు తీవ్రంగా చూస్తూ మౌనంగా వుండిపోయాడు.

ఆ దుర్మార్గుడు మళ్ళీ కోపంగా ఇలా అన్నాడు :

'మొండిగా నిరాకరిస్తే నువ్వు స్వేచ్ఛగా వుండడానికి ఇదే చివరిసారి కాగలదు. ఎప్పుడూ ఈ కొట్లోనే బంధీగా ఉంటావు. ప్రభుత్వాన్ని తీవ్రంగా దూషించావు. అమెరికన్ సలహాదార్లపైన బురద చల్లుతున్నావు. నువ్వు ఈ దుర్మార్గాలకు ఏమేమి నూరిపోసిందీ టేప్ రికార్డు చేసి ఉంది. నువ్వేమి చెప్పింది నీకు వినిపించమంటావా? అమెరికా రక్షణ మంత్రిని చంపడానికి ప్రయత్నించడమే కాదు నువ్వు చేసిన నేరం. జాతీయ (కీలుబొమ్మ) సైన్యాన్ని, చివరకు ప్రధానమంత్రిని అవమానపరచాలనుకుంటున్నావుగూడా!"

ట్రాయ్ ఇలా మాట్లాడాడు.

'నా అభిప్రాయాలను ఎప్పుడూ దాచలేదు. జగద్విఖ్యాతమైన సత్యాన్నే ఉద్ఘాటించాను. నువ్విక్కడకు వార్తా పత్రికలు తెచ్చావు. అమెరికన్ సలహాదారులు వియత్నామీయులకు పరమ మిత్రులని ఆకాశానికెత్తి ఈ పత్రికలు పొగిడాయి. నేను వాటిని చించి ముక్కలు చేశాను. ఎందుకని?"

"అమెరికన్ సలహాదార్లు వియత్నాం ప్రజలకు ప్రధాన శత్రువులు, అందువల్ల వాళ్ళను మట్టుపెట్టాలి. ఈ విషయం పాఠకులకు చెప్పాలని భావించాను కనుకనే అలా చేశాను."

ఆ పోలీసువాడు ఒక కాగితాల మడుపును తెరిచాడు. అందులోంచి కాగితాలను బయటకు తీశాడు. వాటిపైన ట్రాయ్‌ని సంతకం పెట్టమన్నాడు. వాడే చదివి ఇలా అన్నాడు.

'నీవు చేసిన నేరానికి సరిపడా వియత్నాంగ్ వద్ద డబ్బు తీసుకున్నావు'

పడుకొని ఉన్న ట్రాయ్ నెమ్మదిగా తల పైకెత్తి ఇలా జవాబిచ్చాడు.

'ఇది డబ్బు కోసం కాదు. నేను అమెరికన్లను నిరాకరించాను గనుకనే వాళ్ళను హతమార్చాలనుకున్నాను. నేను చేసిన ప్రతి నేరమూ దక్షిణ వియత్నాంను విముక్తి చేయడానికి– నిర్బంధం తొలగించడానికి – అంతే!'

ఆ దుర్మార్గుడు నావైపు చూశాడు.

'నీ భర్తను నేరం ఒప్పుకోమని చెప్పు,

లేకపోతే అతడు చస్తాడు'.

వాడితో ఇలా అన్నాను :

'ఆయన కార్యకలాపాలను గురించి నాకేమీ తెలియదు. ఆయన్ను అంగీకరించమని ఎలా చెప్పగలను?"

ట్రాయ్ చేతుల ఆదరవుతో పడకమీద నుంచి పైకి లేచాడు. కొట్టు పైకప్పులోకి తీక్షణంగా చూస్తున్నాయి కళ్లు. ముఖం కఠినంగా ఉంది. ఆయనకు ప్రాణం అంటే తృణప్రాయంలా ఉంది.

ఆ పోలీసు ముష్కరుడు ఇలా అన్నాడు :

"నువ్వు కాంగ్లీ బ్రిడ్జిని ధ్వంసం చేయాలనుకొన్నావు'

'అవును, అమెరికా రక్షణ మంత్రిని చంపడమే అప్పటి నా తక్షణ కర్తవ్యం'.

'రహస్యాలన్నీ బైటపడకుండా వుండేందుకు కిటికీలోంచి దూకి నీకై నువ్వే ప్రాణం తీసుకోవాలనుకున్నావు.'

'కానే కాదు. ఆత్మహత్యకు పాల్పడతానని నన్నభిమానించే ప్రజలెవ్వరూ అనుకోరు. కిటికీలోంచి కిందికి దూకింది నేను మరణించడానికి కాదు. మీ ముష్కర హస్తాల్లోంచి చావు తప్పించుకొని అమెరికా దురాక్రమణదారులను ఖతం చేయాలన్న నా ధ్యేయాన్ని నెరవేర్చుకోవడానికి. ఆ ప్రయత్నంలో నేను మరణించి వుంటే ప్రమాదవశాత్తుగానే అది జరిగి వుండేది.

ముష్కరులు ఆయన్ను చిత్రహింసలు పెట్టేందుకు సిద్ధమయ్యారు. సైగాన్ ప్రజలు ప్రత్యేకించి విద్యార్థులు, యువకులు శ్లాఘిస్తోన్న ఆయన వీరత్వం, నిశ్చల ధ్యేయాన్ని సడలగొట్టాలని వాళ్ళ ప్రయత్నం.

ఆయన్ను కూర్చోబెట్టారు. కాగితాల మీద బలవంతాన సంతకం పెట్టించడానికి ప్రయత్నించాడు. ఆ కాగితాలు ఒక అబద్ధాల పుట్ట. వాటిని చదివాడు ట్రాయ్. కలం తీసుకొని గీత మార్చి గీతలు అన్నీ నిలువు గీతలు గీశాడు. ఆ ఊపుకు కలం ముక్కు వంగిపోయింది. కలం తీసి వాళ్ళ ముఖాన విసిరికొట్టి పడకమీద పడుకొన్నాడు.

ఆయన్ను భయపెట్టాలనుకున్న పోలీసులు విఫలులయ్యారు. ఇంతకు ముందుకంటే తీవ్రంగా చిత్రహింసలు పెట్టారు. ఆయనతో ఒక్క మాటకూడా మాట్లాడనీయకుండా నన్ను తలుపవతలకి నెట్టి వేశారు. ఆవరణలో నిలబడి పోయాను. బిగ్గరగా ఏడ్చాను. మళ్ళీ దగ్గరకు వెళ్ళడానికి ప్రయత్నించాను. ఇద్దరు ముష్కరులు నా భుజాలు గట్టిగా పట్టుకొని కారులోకి కూలదోశారు.

తిరిగి నన్ను కొట్లోకి నెట్టారు. తోటి ఖైదీలందరూ నన్ను చుట్టుకొన్నారు. 'ఎ', 'వై'లు పరితాపం నుంచి నన్ను ఓదార్చడానికి తీవ్రంగా యత్నించారు. తర్వాత ఏకధారగా కన్నీళ్ళు కారుతూ వుండటం వాళ్ళు చూశారు. కథలు చెప్పడం లేదా వేరే కార్యకలాపాల వైపు నన్ను మళ్ళించడం ద్వారా బాధాపరితప్తత నుంచి ఉపశమనం కలిగించడానికి ప్రయత్నించారు. అప్పుడే తెల్లటి దిండు కవర్లు కుట్టడం పూర్తి చేశాను. వాటిపైన పువ్వులు, ట్రాయ్ పేరు, నాపేరు ఎలా కుట్టాలో 'వై' నాకు నేర్పింది. ఆమె కొన వేళ్లను సూదులతో గుచ్చడం వల్ల పొంగివున్నప్పటికీ ఎంతో పట్టుదలగా నాకు నేర్పించింది.

ఆమె ఇలా చెప్పింది :

'ఈ దిండు కవర్లకు ఎంబ్రాయిడరీ పూర్తి అయిన తర్వాత నీ భర్త దగ్గరకెళ్ళి నాలుగో నెంబరు కొట్లో వున్న సహ ఖైదీలందరూ మీ పెండ్లి కానుకలుగా పంపిన వీటిని స్వీకరించమని చెప్పు. ఫర్వాలేదులే ఆలస్యంగా పంపినా ఆయన స్వీకరిస్తాడు. మేము అలా కుట్టుపని చేసుకుంటూ 'మా పోరాట వీరులకు బట్టలు కుడ్తాం' అన్న పాటను పాడుకునే వాళ్ళం. ఈ పాట ప్రత్యేకించి 'వై'కి బహు ఇష్టం.

ఒక కొత్త ఖైదీ వచ్చాడు. అతడు నాలుగేళ్ళ బాలుడు. అతడి అవ్వతో కలిపి అరెస్టు చేసి తీసుకొచ్చారు. రైతు కుటుంబంలో పుట్టాడేమో గుండ్రని వక్షం, పుష్టికరమైన భుజాలతో ఉన్నాడు. వాడిని జైలు ఆవరణంతా తిరగనిచ్చేవాళ్ళు. అతని అవ్వను నేనున్న కొట్టుకు కొంచెం దూరంగా ఒక కొట్లో వేసి బిగించారు. వాడు ప్రతి కొట్టు వాకిలి దగ్గరకు వెళ్ళి వింతగా తొంగిచూస్తూ తిరిగేవాడు. పిట్టలు కిలకిలా ఎగురుతూంటే వాటిని ఊపిరాడనీయకుండా వెంటబడి తరిమేవాడు. వాటిని పట్టుకోవడానికి మమ్మల్ని సహాయపడమని వెర్రిగా పిలుస్తూ పరుగులెత్తేవాడు. ఒకసారి వార్డరు లాఠీని వాడి దగ్గరకు విసిరాడు.

ఆ వార్డరుతో ఇలా అన్నాడా బాలుడు :

"ఏయ్! ట్రాయ్ మావయ్య మోటారు సైకిల్ నువ్వెందుకు వాడుతున్నావు? వెంటనే తిరిగి ఇచ్చేయ్. లేకపోతే నేను మావయ్యతో చెప్తా".

ఆ కుర్రవాడి స్వభావసిద్ధమైన చొరవ మాకందరికీ నవ్వు కలిగించింది. బహుశా వాడికి ట్రాయ్ పేరుగల ఒక మావయ్య వున్నాడు కాబోలు. ఒకసారి నా పేరు చెబుతూ నన్ను చూడాలని అడిగాడు. నాలుగో నెంబరు కొట్టుకేసి చూపడంతో నా కొట్టు దగ్గరకొచ్చాడు.

"కుయేన్ అత్తయ్యా" అని పిలిచాడు.

నా పేరు తెలుసుకొన్నందుకు ఆశ్చర్యపడ్డాను. నేనిలా అడిగాను

'ఏం కావాలి బాబూ? కుయేన్‌ను నేనే'

ఒక ఆరంజ పండు చూపుతూ ఇలా అన్నాడు ఉత్సాహంగా.

'ఈపండు నీకివ్వమని మావయ్యలు నాతో చెప్పారు. నీవు బాగున్నావో లేదో తెలుసుకొని రమ్మన్నారు".

నేను ఇనప కమ్ముల దగ్గరకెళ్ళాను. ఆ సందుల్లోంచి వాడి చేయి పట్టుకున్నాను. ఆరంజపండు ఒలిచి ఇవ్వబోయాను. వాడు 'వద్దన్నట్టు' తలూపి ఇలా అన్నాడు :

'నాకు శానా యిచ్చారు మావయ్యలు'

బలంగా వున్న వాడి చేతులు పట్టుకొని ఇలా అడిగాను :

'నీ పేరేమిటి బాబూ?'

'డాన్' అన్నాడు.

'ఊఁ! చాలా బావుంది. డాన్ః నువ్వెళ్ళి మావగార్లతో చెప్పు కుయేన్ అత్తయ్య చాలా బావుందని, వారికి నా వందనాలు తెలియజెయ్యి!'

స్పష్టంగా, పెద్దగా 'అవునత్తయ్యా' అంటూ పురుషుల బ్లాక్ వైపు పరుగు తీశాడు. అతడు చిన్న మేకపిల్ల వలె తెలివిగా చురుగ్గా ఉన్నాడు. అతి త్వరితంగానే జైలు ఆవరణంతా తెలుసుకున్నాడు.

చిత్రహింసలకు విపరీతంగా గురై బలహీనపడి చిక్కిపోయిన వాళ్ళకోసం భోజనం తెచ్చి పెడ్తుండేవాడు. వార్డర్లు చూచినప్పుడు బహు నేర్పుగా చేతులు వెనక్కు పెట్టేసి భోజనం దాచేవాడు.

లోయ్ అనే అతణ్ణి ఇటీవలనే అరెస్టు చేసి తీసుకొచ్చారు. నా కొట్టుకు కొన్ని గజాల దూరంలోనే అతణ్ణి నిర్బంధించారు. అప్పుడప్పుడూ అతనికి సిగరెట్లు తెచ్చి ఇస్తుండేవాడు డాన్.

ఒకసారి నేను బాగా అలసిపోయినప్పుడు డాన్‌ను చేత్తో పట్టుకొని నా దగ్గరకొచ్చాడు అతడు.

అతడిలా అన్నాడు :

'వీడు నీ మేనల్లుడు. ఇంకా నీవు గుర్తుపట్టలేదా? నీ భర్త డాన్‌కు బాగా తెలుసు. ట్రాయ్ విప్లవ కార్యకలాపాలతో సంబంధం వున్నదని అనుమానించి వీడినీ, వీళ్ళవ్వను తీసుకొచ్చి ఇక్కడే బంధించారు.'

డాన్ వైపు చూస్తూ ఇలా అన్నాడు :

'ఈమె కుయేన్ అత్తయ్యారా! ట్రాయ్ మావయ్య లేడూ ఆయన భార్య. నమస్తే అని చెప్పు'

వినయంగా చేతులు జోడించి గౌరవభావంతో ఇలా అన్నాడు డాన్.

'నమస్తే కుయేన్ అత్తయ్య గారూ !'

దగ్గరకు తీసుకొంటూ ఇలా అన్నాను :

'అయితే నీకు ట్రాయ్ మావయ్య తెలుసన్నమాట. నిజంగా ఆయన్ను ఎరుగుదువా?'

(తరువాతి భాగం వచ్చేవారం)



లక్కడి వ్యూ పాయింట్

ఉత్తుంగ ఝరి సూచిపురా జలపాతం

ఎగిరే బాతులు... నేర్చుకున్న పాఠాలు

- కె. అరుణ

మర్నాడు కాలిపెట్టలో కేరళ సాంప్రదాయపు దేవాలయంచూసి కర్లాడ్ లేక్‌కు వెళ్లాం. అది వంగపండురంగు కలువలు(వాటర్ లిల్లీ)లతో నిండిన స్వచ్ఛమైన సరస్సు. అక్కడి ప్రత్యేకత వెస్ట్ ఇండియన్ విజిల్ డక్(బాతు). అది ఈలవేస్తుంది. మునిగిందంటే పదినిముషాల వరకూ తేలదు. ఆపకుండా మూడు కిలోమీటర్లు ఎగరగలదు. మాకు ఎగిరి చూపించింది కూడా! దారంతా కేరళలో జరుగుతున్న పంచాయితీ ఎన్నికల సంరంభం. ఇక మన జెండాలు, హోర్డింగులే దారంతా! భలే సంతోషమేసింది. తరువాత బాణాసుర డ్యామ్‌లో అందమైన చిన్న దీవులమధ్య బోటింగ్ చేశాం. మధ్య దీవులలో గడ్డి కోసుకుంటూ స్త్రీలు కనిపించారు. వీరు బోట్‌లో వచ్చి గడ్డి కోసుకుని వెళ్లిపోతారన్నమాట! దూరంగా కొండల్లో అక్కడక్కడా ఒక్కో ఇల్లు కనిపించింది. ఇంత దట్టమైన అడవుల్లో మనుషులా అనిపించింది.

తరువాత మీన్‌ముట్టి జలపాతం. మనిషి నడిచేంత దారిలో గంటన్నర కొండలూ, గుట్టలూ ఎక్కి వెళ్లాలి. అక్కడి ఆదివాసీ యువతి 'రెమా' కబుర్లు, స్థానిక విశేషాల తోడుగా మా నడక సాగింది. ఇక్కడ చిత్రం ఏమిటంటే... ఏ ఇళ్లనైతే మేం బాణాసుర బోటింగ్‌లో చూసి నివ్వెరపోయామో, ఆ ఇళ్ల పక్కగానే మా నడక. ఇక ఆ జలపాతంలోని నీళ్లు నున్నటి పెద్ద రాళ్లమీదుగా జారుడుబండమీద నీరు జారుతున్నట్లు జారుతున్నాయి. అక్కడున్న యూకలిప్టస్ వాసనే వేరు! ఎంతైనా కొండగాలికీ, మట్టికి, ఆ నీటికీ పెరిగే చెట్లే వేరు. అందులోని ఔషధగుణాలూ వేరు! అన్నట్లు కేరళలో అన్నిచోట్లా వెనిగార్‌లో ఉప్పు, పచ్చిమిర్చి వేసి నానబెట్టిన ఉసిరి, సీమరేగు, మామిడి, పైనాపిల్ విరివిగా దొరుకుతాయి. మన తిరుగుడుకు అవి సరిగ్గా సూటవుతాయి. మెల్లగా తింటూ కొండలెక్కితే అలసటా రాదు, దాహమూ వేయదు.

జలపాతం తరువాత అద్భుతమైన పుక్కోట్ సరస్సులో విహారం. బోటింగ్ మధ్యలోనే పెద్ద వాన. వాన పడినంతసేపు వెళ్లిపోవాలనే ఒక భయం. తగ్గాక, 'మరేం ఫర్వాలేదులే' అనే ధైర్యం. క్షణానికో రకంగా మారిపోయే వాతావరణం వింతగా అనిపించినా... ఆహ్లాదంగా వుంది. తరువాత అరటిపండు బజ్జీ(మీరు సరిగ్గానే చదివారు! నిలువుగా కోసిన అరిటిపండు ముక్కలతో వేసిన బజ్జీ) వేడివేడిగా 'మింగాం'. తరువాత లక్కడి వ్యూ పాయింట్. అడవి, జలపాతాలు, మెలికలు తిరిగే రోడ్లూ వెరసి ఆ వ్యూ చాలా విశాలమైనది. అవి చాలవన్నట్లు మనమీదనుంచే మబ్బులు వెళ్లిపోతుంటాయి. తనువంతా ఝల్లనిపించే కంపనం. ఒళ్లంతా మెరుస్తున్న తుంపర్లు... మొత్తానికి అదో విచిత్రమైన, మర్చిపోలేని ఫీలింగ్.

ఆరోజు చివరిగా చైన్ ట్రీ చూశాం. దీనికో చరిత్ర వుంది. బ్రిటిషర్లు మన దేశాన్ని ఆక్రమించి, పాలిస్తున్నా ఇక్కడి వేడికి తట్టుకోలేకపోయేవారు కదా! దాంతో హిల్‌స్టేషన్లను వెతికేవారు. అలా ఒక గైడ్, బ్రిటిషర్ కలిసి లక్కడి వ్యూ పాయింట్‌ను కనుగొన్నారు. గైడ్ తీసుకెళ్లాడంటే అతనికి అప్పటికే తెలుసని కదా అర్థం. కనుక ఆ గొప్పంతా ఆ గైడ్‌కే వెళ్లిపోతుందని భయపడ్డ బ్రిటిషర్ అతన్ని చంపేశాడు. కానీ అతని 'ఆత్మ' అక్కడే తిరిగేదనీ, దాన్ని బంధించి అక్కడ గొలుసులతో కట్టేశారనీ, ఆ చెట్టుతోపాటే గొలుసూ పెరుగుతోందనీ కథనం. తక్కింది పుక్కిటి పురాణమైనా బ్రిటిషర్ అతన్ని చంపడం వరకూ వాస్తవం.

మర్నాడు శిబి వర్గిస్ అనే మిత్రుని ఫాంలో స్పైస్ గార్డెన్ చూశాం. మనం కరివేపాకు,



బాణాసుర డ్యామ్

గులాబీలు పెంచుకున్నట్లు వాళ్లు యాలకులు, దాల్చినచెక్క(మీకు తెలుసా? దాల్చిన చెక్క ఆకులే బిర్యానీ ఆకు), అల్లం, జాజికాయ, లవంగం... వంటి చెట్లు పెంచుకుంటారు. అవసరమైనప్పుడు అలా పెరట్లోకెళ్లి తుంచుకుని ఎంచక్కా వాడుకుంటారన్నమాట! కానీ బోలెడంత పాడి వున్నా వాళ్లు డికాక్షన్ కాఫీ ఇవ్వడం 'చేదు'గా అనిపించింది. అదే మనకుంటే గుమ్మపాలతో కమ్మని కాఫీ చేసుకునేవాళ్లంగా!

తరువాత సూచిపురా జలపాతానికి వెళ్లాం. దానికి గంటన్నరపైగా నడిచెళ్లాలి. కానీ దారి కష్టంగా వుండదు. సరదాగా కబుర్లు చెప్పుకుంటూ వెళ్లిపోవచ్చు. పచ్చని ప్రకృతి, మీదుగా వెళ్లే మబ్బులు మనకెలాగూ కష్టం తెలీనియ్యవు. జలపాతం దగ్గరికి వెళ్లాలంటే ఓ పెద్ద రాయినుండి దూకాలి. ఇద్దరు మహిళా సిబ్బంది అందుకు సాయం చేస్తున్నారు. లేకుంటే దిగడం కష్టమే. ఆ జలపాతం చాలా ఉధృతమైంది. చాలా ఎత్తునుంచి దూకే దాని తాకిడి చాలా తీవ్రం. చాలా దూరంగా వున్నా ఆ తుంపరలకే తడిచి ముద్దయిపోతాం. దాని సౌందర్యానికి ముద్దయిపోవడం మరో పార్శ్వం! పైకొచ్చాక చాలామందికి చిన్న జలగలు పట్టుకున్నాయి. ఇవి మన రాజకీయ నాయకులను మించిపోయాయి. కుడుతున్నట్లు స్పర్శ తెలీదు, నొప్పి తెలీదు. నైస్‌గా మన రక్తం పీల్చేస్తుంటాయి. దగ్గరే వున్న ఉప్పుజల్లితే వెంటనే వదిలేశాయి.

తరువాత దారి కనిపించనంత దట్టంగా కమ్ముకున్న మబ్బుల్లో పయనిస్తూ ఊటీ చేరాం. కాలిపెట్టనుండి ఊటీ చేరే దారిలో 36 హెయిర్‌పిన్ పాయింట్లున్నాయి. వెంట వెంటనే మలుపులు, మెలికలు. డ్రైవ్ చేసేవారికి ఛాలెంజే! అన్ని రోజులుగా అడవుల్లో తిరిగినా పుట్టని చలి ఊటీకి చేరగానే మొదలైంది.

మర్నాడు పొద్దున్నే బయల్దేరి బొటానికల్ గార్డెన్స్‌కు వెళ్లాం. అక్కడ ఎన్ని వందల డ్యూయెట్లు షూట్‌చేశారో చెప్పడం కష్టం. కొన్ని వేల రకాల దేశ విదేశాల పూలు, తీర్చిదిద్దిన లాన్లు వర్ణింపరానంత సొగసుగా వుంది. సిబ్బంది ఎప్పటికప్పుడు తీర్చిదిద్దుతూనే వుంటారు కామోసు! అంటంగా, అద్భుతంగా వున్నమాట వాస్తవమే అయినా గుండెలో ఏదో కెలికినట్లుగా కలుక్కుమంది. అప్పటిదాకా స్వేచ్ఛగా పెరిగిన వృక్షాలు, పొదలు, పుష్పాలు చూసి అబ్బురపడ్డాం. ఇక్కడ కత్తుల బోనుల్లా నిర్దేశించిన పరిధుల్లో పెరుగుతోన్న పూబాలలను చూస్తుంటే 'పుష్పవిలాపం' గుర్తొచ్చింది. ఎంత అందంగా పెరిగితే ఏంటి? హద్దు దాటితే 'కట్'! అంతేగా వాటి జీవితం! పరిమితులు, బంధనాల మధ్య గులాబీలు ఎంత పెద్దగా విరబూస్తే ఏంటి వాటిలో కనిపించేవి జీవంలేని 'ప్లాస్టిక్ నవ్వులే'!

తరువాత థ్రెడ్ గార్డెన్. 50 మంది మహిళలు పన్నెండేళ్లు రంగురంగుల దారాలతో అల్లిన పూదోట అది. వారి సృజన, ఓపికకు అద్దంపడుతున్న పూలు దారాలతో అల్లినవంటే నమ్మడం కష్టమే. అది సరిగ్గా ఊటీ లేక్ ముందుంటుంది. అక్కడే పదిరూపాయలకు మూడు చేమంతుల గుత్తులు కొన్నాం. అమ్మే మహిళ ఆ పూలు యేడాదంతా అలాగే వుంటాయని చెప్పింది. ఎవరైనా నమ్ముతారా? ఊరికే అంటోందిలే అనుకుంటూ మూడు గుత్తులు కొన్నాం. వెంటనే రోజ్ గార్డెన్, తమిళనాడులోనే ఎత్తైన ప్రదేశమైన దొడ్డబెట్ట చూసుకుని సాయంత్రానికి కోయంబత్తూరుకు తిరుగు ప్రయాణం.

కోయంబత్తూరు పొలిమేరల్లోనే బోలెడంత దుమ్మూ, ధూళి. దారికిరువైపులా దట్టంగా పెరిగిన పెద్ద పెద్ద చింతచెట్లను వరుసగా నరికేస్తున్నారు. చెట్టునిండా కాయలతో నిండు గర్భిణీల్లా వున్న ఆ మహా వృక్షాలు నేలరాలుతుంటే మనసంతా కల్లోలమైపోయింది. అడవిలో చింతకాయలను ఎంతో ఆత్రంగా కోసుకున్నాం. కానీ ఇక్కడ అన్ని కాయలు కనిపిస్తున్నా తాకాలనైనా అనిపించలేదు. తెగ నరికిన కన్నతల్లిని చూస్తూ ఆక్రోశిస్తున్న చంటిపిల్లల్లా కనిపించాయవి! అప్పటిదాకా ఏ ప్రకృతినైతే చూసి పులకరించామో రోడ్ల వెడల్పు పేరిట ఆ ప్రకృతినే నాశనం చేస్తోంటే, భవిష్యత్తుకు చేతులారా తూట్లుపొడుస్తుంటే మది వికలమైపోయింది. మనిషెంత మూర్ఖుడు! బుద్ధిజీవి అని గర్వంగా చెప్పుకుంటాం కానీ అదెంతవరకూ వాస్తవం? ఎన్నిరకాలుగా నాశనంచేసినా మనకు చేయాల్సినంత మేలు చేస్తూనే వుంది. అచ్చంగా గర్భంలో బిడ్డ కాళ్లతో తన్నినా తల్లికి కోపం రానట్లుగా! నిజానికి ఈ నింగీ, నేలా, చెట్టు, పువ్వు ఏమాశించి మనకింత మేలు చేస్తున్నాయి? దానివల్ల వాటికేం సంతోషం? తుంచి, తెంచి వాడుకోవడం తప్ప మనమేమీ చేయమే! అయినా మనపై ఎందుకింత దయ? ఇంత ఓరిమి వహిస్తున్న ధరిత్రి సహనం కోల్పోతే? పరిస్థితి తన చేయి దాటిపోతే? 'చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే?'

మొత్తానికి యాత్ర పరిపూర్ణంగా సాగింది. ప్రకృతిలో తడిచి(అనేకచోట్ల వాన పడింది కూడాను!) ముద్దయ్యాక ఏదో సంతృప్తి, సంపూర్ణత్వం చేకూరింది. ఎన్నో ప్రాంతాలు చూడటమే కాదు. ఎన్నో పాఠాలు నేర్చుకున్నాం. అవును! పుస్తకాల్లో నేర్చుకునే పాఠాలకన్నా అనుభవాలు నేర్పే పాఠాలు మరింత విలువైనవి. అందులోనూ ప్రకృతి సుతిమెత్తగా నేర్పే పాఠాలు !! అలాంటి పాఠాలను, అనుభవాలను జీవితాంతం గుర్తుంచుకోవాలి. ఇవి ఆర్జనకు ఉపయోగపడే పాఠాలు కాకపోవచ్చు. కానీ మనుగడకు పాఠాల్లాంటివి.

ఏదేమైనా ఈ టూర్ ఎన్నడూ మరువలేనిది. అడవిలో కోసుకొచ్చిన చింతకాయల పచ్చడంత కమ్మనైనది. ఇప్పటికీ వాడిపోని ఊటీలో కొన్న చేమంతులంత అందమైనది.

★



అట్టమీది కథ

పిల్లల రాజ్యం

కొత్తగూడెం బాలోత్సవ్‌కు 20 ఏళ్లు

-పుప్పాల మట్టయ్య

పిల్లలను అపురూపంగా చూసుకుంటాం. ప్రతి విషయంలోనూ వారికి ప్రప్రథమ ప్రాధాన్యతనిస్తుంటాం. వారిగురించి ప్రత్యేకంగా ఆలోచిస్తాం. వారికోసం పరితపిస్తాం. వారికోసం ఏం చేయాలి? ఏం చేస్తే వారి భవిష్యత్తు బంగారుమయమౌతుంది? అనుకుంటాం. ఒక్కమాటలో చెప్పాలంటే పిల్లలను వివిపిలు మాదిరిగా చూస్తాం. కానీ వాస్తవానికి వారికోసం ఏం చేస్తున్నాం మనం? చదువులు తప్ప వారికేమిస్తున్నాం? చిన్నారుల్లో దాగివున్న నైపుణ్యాలను బయటకు తీసుకురావడానికి ఏకొంచెమైనా ప్రయత్నిస్తున్నామా? అంటే '...లేదు...' అన్నమాట అస్పష్టంగా మన నోటెంట వస్తుంది. ఇలాంటివాటికి బాలల దినోత్సవం లాంఛనమైనది. చిన్నారుల పెద్ద పండుగ సందర్భంగా... నిన్నటి బాలలే నేటి పౌరులుగా మారినవారు కొత్తగూడెంలో చేస్తున్న ఉత్సవమే 'బాలోత్సవ్'. 1991 నుండి ఖమ్మం జిల్లా కొత్తగూడెం క్లబ్ ఆధ్వర్యంలో దార్శనికుడు డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు చొరవతో ఈ కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఈ యేడాదితో బాలోత్సవ్‌కి 20 వసంతాలు నిండాయి. ద్విదశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నారు. సుమారు 15వేల మంది బాలబాలికలు ఈ ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. కేవలం నాలుగు అంశాలతో 1991లో మొదలై రాష్ట్రం నలుచెరుగులా బాలోత్సవ్ సంస్కృతి వ్యాపించింది. కొత్తగూడెం అంటే బొగ్గు గనులకు ప్రసిద్ధి అనే రోజులు పోయాయి. సింగరేణి బొగ్గు పెళ్లల్లో నుండి వచ్చే మట్టి పరిమళాలను, మాతృభాషా మాధుర్యాన్ని ఆస్వాదించాలనుందా... అయితే మీ చిన్నారులతో బాలోత్సవ్‌ను ఒక్క సారన్నా దర్శించాల్సిందే...

నవంబర్ 14 నెహ్రూ జయంతి. నెహ్రూకు బాలలంటే అమితమైన ప్రేమ కనుక ఆయన జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నాం. బాలల దినోత్సవం రోజు విద్యార్థులు ఒక రోజు మాస్టారి అవతారమెత్తడం, సాయంత్రానికి ఒక గ్రూపు ఫొటోతో మొక్కుబడిగా కార్యక్రమాన్ని ముగించడం కొన్నేళ్లుగా సాగుతున్న తంతు. నేడు కార్పొరేట్ కల్చర్‌లో చాలా పాఠశాలల్లో విద్యార్థులను ర్యాంకుల కోసం బట్టీలు పట్టించడం.. సెలవులు కూడా ఇవ్వకుండా తరగతి గదుల్లో నిర్బంధించడం చూస్తున్నాం. విద్యార్థులు సొంతంగా ఆలోచించే సమయం కూడా వారికి ఇవ్వడంలేదు. ముఖ్యంగా ప్రపంచీకరణ నేపథ్యంలో కంప్యూటర్ స్పీడుతో మనిషి పోటీపడుతున్నాడు. అదే సందర్భంలో అభివృద్ధి అనేది పురోగమన దశలో ఉండాల్సింది పోయి తిరోగమనం పట్టడం బాధాకరం. గ్లోబలైజేషన్‌లో బంధాలు, బంధుత్వాలు, భాష, సంస్కృతి, సంప్రదాయాలు, చేతివృత్తులు మంటగలిసి పోతున్నాయి. పిల్లలు హాస్టళ్లలో, తల్లిదండ్రులు కార్యాలయాల్లో, తాతయ్య, నాయనమ్మలు వృద్ధాశ్రమాల్లో ఇలా ఒకే ఊరిలో ఉంటూ

భాష, సంస్కృతి, సంప్రదాయాల వారసత్వం కొనసాగాలి

విద్యార్థుల్లో చిరుదీపం వెలిగిద్దామనే ఉద్దేశ్యంతో బాలోత్సవ్ కార్యక్రమాన్ని చేపట్టాను. విద్యార్థులకు తల్లిదండ్రుల మీద ఉన్న ప్రేమలాగే మాతృభాషపై కూడా ప్రేమను కలిగించాలనే ఉద్దేశ్యంతో తెలుగు భాషపై ఆసక్తి కలిగించాలనుకున్నాను. అందుకు తెలుగులో ఉన్న గొప్ప సాహిత్యాన్ని పిల్లలకు చేరువ చెయ్యాలనుకున్నాను. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉన్నప్పుడు తాతయ్య, అమ్మమ్మ, అత్తయ్య, నానమ్మలు పిల్లలకు ఇంటి వద్ద కథలు చెప్పి అందులోని నీతిని వివరించేవారు. మంచీ చెడును తెలియజెప్పేవారు. కానీ ప్రస్తుత స్పీడు యుగంలో అమ్మా నాన్నలు ఉద్యోగాల ఉరుకుల పరుగుల్లో ఉన్నారు. ఇక తాతయ్యలు, నానమ్మలు వృద్ధాశ్రమాల్లో ఉన్నారు. ఇక వీరికి మంచీ చెడులు చెప్పే వారే లేకుండా పోయారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులు, యువతీ, యువకులు సాహిత్యం చదవడం ఎంతో అవసరం. అందుకే తెలుగు సాహిత్యంలో ఉన్న గొప్ప కథలను పిల్లల చేత చదివించడం, రాయించడం, విశ్లేషించడం చేయిస్తున్నాము. దీని ద్వారా విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకత వెలుగులోకి తీసుకొస్తున్నాము. ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 200మంది విద్యార్థులు కథలు రాస్తున్నారు. విశ్లేషిస్తున్నారు. దీనితో పాటు లఘుచిత్ర విశ్లేషణను కూడా బాలోత్సవ్‌లో ప్రవేశపెట్టాము. దీని ద్వారా 20 నిమిషాల నిడివిగల ఓ మంచి చిత్రాన్ని వారికి చూపించి



దానిలోని మంచీ చెడులను గుర్తింపజేసేలా విశ్లేషణ చేయిస్తున్నాము. అందుకు గాను సినీ విశ్లేషకులు వారాల ఆనంద్, అక్కినేని కుటుంబరావు లాంటి ప్రముఖులు ఈ కార్యక్రమానికి వచ్చి చిత్రాల విశ్లేషణపై వివరించి విద్యార్థుల్లో సామర్థ్యాన్ని పెంచుతున్నారు. ప్రదర్శనా కళల్లో భరతనాట్యం, కూచిపూడి లాంటి అంతరించి పోతున్న మన సంస్కృతి, సంప్రదాయ కళలను కూడా వారికి గుర్తు చేస్తున్నాము. 'నా కోసం నువ్వు. నీకోసం నేను' అనే భావన పిల్లల్లో కలగాలి. వారిలో సమిష్టితత్వం పెరగాలి. గిరిజన పాఠశాల నుండి వచ్చిన పిల్లలు కార్పొరేట్ పాఠశాల నుండి వచ్చిన పిల్లలు ఒకరి నొకరు కలుసుకుని వివరాలు తెలుసుకోవాలి. పరిచయాలు ఏర్పరుచుకునేందుకు బాలోత్సవ్ ఓ విశిష్ట వేదికగా నిలవాలనేది నా ఆకాంక్ష.

డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు,

బాలోత్సవ్ కన్వీనర్.

కూడా పరాయివాళ్లలా జీవిస్తున్నాం. మదర్స్‌డే, ఫాదర్స్‌డేల పేర యేడాదిలో ఒక్క రోజు కలుసుకుని ఒలపోసుకుంటున్నాం. నిజంగా పిల్లలు పిల్లల్లా ఆలోచిస్తున్నారా? పిల్లల్లా ఆడుకుంటున్నారా? వర్షం పడ్డప్పుడు చినుకుల్లో తడుస్తూ వాననీటిలో ఇసుకతో డ్యాములు కడుతున్న బాల ఇంజనీర్లు మీకు కనిపిస్తున్నారా? ఎండిన తుమ్మకాయలను కాళ్ల గజ్జెలుగా కట్టి నాట్యం చేస్తున్న కళాకారులు కనిపిస్తున్నారా? ఊరి చివర వ్యవసాయ బావిలో దూకి ఈత కొడుతూ కేరింతలు కొడుతున్న బుడ్డపరకల్లాంటి చిన్నారి బాల్యం మీకు కనిపిస్తుందా? కోతికొమ్మచ్చి ఆటలు, పండు వెన్నెల్లో వెన్నెల కుప్పలు వంటి ఆటలు మచ్చుకైనా కనబడటం లేదుకదా! బాల్యం ఒక వరం..శాపం కావడానికి కారణాలు ఏమిటి? అనే ఆలోచనలో నుండే బాలోత్సవ్ రూపుదిద్దుకుంది.

గరికపచ్చ మైదానాల్లోనూ,
తామరపూవుల కోనేరులలో,
పంటచేలలో, బొమ్మరిళ్లలో,
తండ్రి సందిటా, తల్లి కౌగిటా,
దేహధూళితో, కచభారంతో,
నోళుల వ్రేళులు, పాలబుగ్గలూ,
ఎక్కడ చూస్తే అక్కడ మీరై
విశ్వరూపమున విహరిస్తుండే
పరమాత్ములు...
ఏమీ ఎరుగని పూవుల్లారా,
అయిదారేళ్ల పాపల్లారా!

అని మహాకవి శ్రీశ్రీ కలలుగన్న మరో ప్రపంచాన్ని పిల్లలకు అందించేందుకు ఖమ్మం జిల్లా కొత్తగూడెం బాలోత్సవ్ వేదికగా మారింది.

బాలోత్సవ్‌కు అంకురార్పణ ఇలా..!

బాలోత్సవ్ ఆవిర్భవించడం వెనుక ఓ ఆసక్తికరమైన విషయం ఉంది. కొత్తగూడెం, పాల్వంచ పారిశ్రామిక ప్రాంతాలు కావడంతో నిత్యం ఎంతో మంది అధికారులు, అనధికారులు వచ్చివెళ్లేవారు. వారితో సహా పట్టణంలోని ప్రముఖుల ఆటవిడుపు కోసం 1960లో రిక్రియేషన్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. క్లబ్ అంటే సాధారణంగా ప్లేకార్డ్స్, చెస్, షటిల్, క్యారమ్స్ వంటి ఆటలతోనే కాలం వెళ్లదీసేవారు. పిల్లలు కానీ, ఇతర సాధారణ ప్రజలు కానీ ఆవైపు కన్నెత్తి చేసే వారు కాదు. క్లబ్ అంటే ఆనాడు అలాంటి వాతావరణం ఉండేది. ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో



ఇదే పరిస్థితి. అలాంటి పరిస్థితుల్లో 1991లో క్లబ్ కార్యదర్శి పదవికి ఎన్నికలు జరిగాయి. కార్యదర్శిగా ఎన్నికైన వారు ఎలాంటి కార్యక్రమాలు చేపడతారో సభ్యులకు వివరించాల్సి ఉంటుంది. అప్పుడు పోటీలో ఉన్న డాక్టర్ వాసిరెడ్డి రమేష్‌బాబు తన అభిప్రాయాన్ని చెబుతూ క్లబ్ అంటే ప్రజల్లో ఉన్న దురభిప్రాయాన్ని పోగొట్టడమే తన ధ్యేయమనీ, సామాన్యులను కూడా ఆకర్షించగలిగే కార్యక్రమాలను చేపడతానని ఆయన సగర్వంగా చెప్పారు. అలా ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకొనేందుకే బాలోత్సవ్‌కు అంకురార్పణ చేశారు. మొదట కేవలం కొత్తగూడెం పట్టణ ప్రాంత విద్యార్థులను తీసుకొని నాలుగు అంశాలలో పోటీలు నిర్వహించారు. మరుసటి సంవత్సరం పాల్వంచ పట్టణ విద్యార్థులను కూడా ఆహ్వానించారు. ఆ తర్వాత మండల స్థాయికి, అటు తర్వాత క్రమంగా జిల్లా స్థాయికి విస్తరించారు. 2000 సంవత్సరం నుండి రాష్ట్ర స్థాయి బాలోత్సవ్ కార్యక్రమంగా రూపుదిద్దుకుంది. ఆ యేడాది నాలుగు జిల్లాల నుండి మాత్రమే బాల బాలికలు వచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి ఏటా 15వేల మంది విద్యార్థులు హాజరవుతున్నారు.

నిర్వహణ ఎలా..?

ఇంత పెద్ద కార్యక్రమం, అంత మంది పిల్లలు, ఎవ్వరికీ ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలంటే ఎంత పకడ్బందీ ఏర్పాటు చేయాలి. ఎంత మంది వాలంటీర్లు కావాలి? మరి

వీటన్నిటికీ ఎంత ఖర్చు కావాలి? కానీ కొత్తగూడెం క్లబ్ వారు మాత్రం ఎప్పుడూ డబ్బు గురించి ఆలోచించలేదు. మొదట్లో కొత్తగూడెం క్లబ్ నుండి వచ్చే ఆదాయంతో పాటు క్లబ్ మెంబర్లు కూడా తోచినంత సాయం చేసి కొంత కాలం కార్యక్రమాలు నిర్వహించారు. బాలోత్సవ్‌కు వస్తున్న ఆదరణను చూసి ఆ తర్వాత పట్టణంలోని ప్రముఖులైన డాక్టర్లు, లాయర్లు, జడ్జీలు, బ్యాంకు మేనేజర్లు, రిటైర్డ్ ఉద్యోగులు సహా డైరెక్టర్ స్థాయి నుండి కార్మికుల వరకు తమ వంతు సాయం చేస్తామని ముందుకు వచ్చారు. వీరితో పాటు అమెరికా, బ్రిటన్ తదితర దేశాల్లో స్థిరపడిన ప్రవాస భారతీయులు కూడా ఆర్థిక సాయం చేస్తూ వచ్చారు. పట్టణంలోని అన్ని టెంట్ హౌస్‌ల వారు టెంట్, వంట సామాగ్రిని, లైటింగ్ సిస్టమ్ వారు లైటింగ్ అండ్ మైక్‌సెట్లను ఇలా ఒక్కటేమిటి ఎవరికి తోచింది వారు సాయం చేసి తమ భాగస్వామ్యం కూడా బాలోత్సవ్‌లో ఉందని గర్వంగా చెప్పుకుంటారు. స్థానిక ఎస్‌బిహెచ్ పోస్టాఫీస్ బ్రాంచ్ వారు ఈ మూడు రోజుల పాటు మినరల్ వాటర్‌ను ఉచితంగా సరఫరా చేసి తమ ఔదార్యాన్ని చాటుకుంటున్నారు. ఈ కార్యక్రమానికి కెసిపి సిమెంట్స్ లిమిటెడ్‌వారు, హైదరాబాద్‌కు చెందిన నోవా అగ్రిటెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ ఏలూరి సాంబశివరావు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. వీరితో పాటు ఇక స్వచ్ఛందంగా వచ్చి పని చేసే వారు అనేక మంది ఉన్నారు. ఎన్‌సిసి క్యాడెట్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్, స్వచ్ఛంద సేవా సంస్థలు ఇలా ఎంతో మంది బాలోత్సవ్‌లో పాల్గొని తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారు.

భోజన ఏర్పాట్లు

ప్రతి రోజూ నాలుగు వేల మందికి పైగా చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు రుచికరమైన, పౌష్టికాహారం ఏర్పాటు చేస్తున్నారు. ఇంత మంది విద్యార్థులకు వడ్డించడమంటే మాటలు కాదు. ఏదో హడావిడిగా వంట చేసి పెట్టి చేతులు దులుపుకునే పరిస్థితి ఇక్కడ కనిపించదు. ఏ ఒక్క విద్యార్థి కూడా తనకు భోజనం కానీ టిఫిన్ కానీ అందలేదనే సమస్యే రాదు. సింగరేణి అధికారి మాధవరావు వండే వంటలను పిల్లలు, పెద్దలు లొట్టలు వేస్తూ తింటారు. ఉదయం టిఫిన్ ఇడ్లీ, వడ, జీడిపప్పు ఉప్మా, పూరీ ఏర్పాటు చేస్తున్నారు. మధ్యాహ్నం భోజనంలో మూడు రకాల కూరలు, సాంబారు, రసం, పెరుగు, అరటిపండు, స్వీటు, అప్పడం వడ్డిస్తున్నారు. ఆఖరి రోజున అందరికీ గుర్తుండిపోయేలా చికెన్ బిర్యానీ కూడా

పెడుతున్నారు.

విద్యార్థులకు వసతి

రాష్ట్రం నలుమూలల నుండి వచ్చే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉండేందుకు కొత్తగూడెం క్లబ్ నిర్వాహకులు వారికి చక్కని వసతి ఏర్పాట్లు చేస్తున్నారు. సింగరేణి క్వార్టర్స్, మార్కండేయ సత్రం, ప్రభుత్వ గెస్ట్‌హౌస్, ఐఎంఏహాలు, టిఎన్‌టియుసి, సిపిఎం, సిపిఐ కార్యాలయాలతో పాటు పట్టణానికి చెందిన కొందరు ప్రముఖులు కూడా వారి నివాసాల్లో వసతి ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకూ గురికాకుండా కంటికిరెప్పలా చూస్తున్నారు.

గ్లోబల్ వార్మింగ్ నేపథ్యంలో థీమ్ పార్క్...

గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోయి పర్యావరణ సమతుల్యతలు దెబ్బతింటున్న నేపథ్యంలో థీమ్‌పార్క్ పేరుతో విద్యార్థులకు ప్రకృతి గురించి అవగాహన కలిగిస్తున్నారు. ఈ కాలం పిల్లలకు ప్రకృతిలోని అనేక విషయాలు తెలియడంలేదు. ప్రకృతిని ఎలా ఉపయోగించుకోవచ్చు అనే అంశాలు థీమ్‌పార్క్ ద్వారా చూపిస్తున్నారు. పిల్లలు ప్రకృతిని ప్రేమించాలనే ఉద్దేశ్యంతో ఈ ఈవెంట్‌ను ప్రవేశపెట్టారు. దీనిలో భాగంగా ప్రకృతితో ముడిపడిన అంశాన్ని ఏటా ఒక థీమ్‌గా తీసుకుని దానిని పిల్లలకు వివరిస్తున్నారు. ఉదాహరణకు పూర్వ కాలంలో ఇల్లు, ప్రస్తుత ఇల్లు అంశాన్ని తీసుకొంటే పూర్వం ప్రకృతిని ఎలా ఉపయోగించుకున్నారో దీని ద్వారా చూపిస్తారు. పూర్వకాలం ఇళ్లల్లో ఉన్న ఉట్టి, రుబ్బురోలు, కవ్వం, లాంతరు, విసుర్రాళ్లు, నాగలి లాంటివి అనేక వస్తువులు ఈ కాలం పిల్లలకు తెలియదు. పాత రోజులకు, ఇప్పటికి వ్యత్యాసం ఎలా ఉంది. ప్రకృతిని గతంలో ఎలా వాడుకున్నాం. ప్రస్తుతం ఎలా నాశనం చేస్తున్నాం అనే అంశాలను ఈ థీమ్‌పార్క్ ద్వారా విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్నారు. వీటితో పాటు ఇంకా 'వ్యర్థంతో అర్థం' అనే అంశంలో పనికి రాని వస్తువులతో ఉపయోగపడే వస్తువులను తయారు చేసేలా విద్యార్థులను ప్రోత్సహించడం చేస్తున్నారు. దీనిలోనూ నిర్వాహకులు సామాజిక స్పృహను

నియమ నిబంధనలు

బాలోత్సవ్‌లో పాల్గొనే విద్యార్థులను మూడు విభాగాలుగా విభజిస్తారు. వీరిలో నర్సరీ నుండి 4వ తరగతి వరకు సబ్‌జూనియర్స్, 5వ తరగతి నుండి 7వ తరగతి వరకు జూనియర్స్, 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు సీనియర్స్‌గా విభజిస్తారు. పోటీలో పాల్గొనేందుకు ఈ కింది నియమ నిబంధలు తప్పక పాటించాలి.

- ప్రతి విద్యార్థి తాను చదువుతున్న పాఠశాల నుండి గుర్తింపు కార్డు తెచ్చుకోవాలి.
- స్కూల్ యూనిఫారంలో పోటీలలో పాల్గొనకూడదు.
- పోటీలలో పాల్గొనే వారు జడ్జీలకు తమ పేరు, స్కూలు, ఊరు పేరు చెప్పకూడదు.
- వ్యక్తిగత పోటీలకు కోడ్‌నెంబర్లు ఇస్తారు.
- పోటీదారులు తాము పాల్గొనే అంశాలను ధృవీకరిస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయుల నుండి అనుమతి పత్రం పొందాలి.
- పోటీలకు కేటాయించిన కాలపరిమితిలోనే అంశాలను పూర్తి చేయాలి. అదనపు సమయం తీసుకున్నచో అనర్హతగా భావించబడుతుంది.
- విజేతల ఎంపికలో న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం.

నిర్వాహకుల ఫోన్ నెంబర్లు : 08744 242349, 9849502501, 9849502501, 9397346641, మరిన్ని వివరాలు కోసం www.balotsav.com చూడండి.

వీడలేదు. అలంకార ప్రాయవస్తువులను కాకుండా సమాజానికి ఉపయోగ పడే వస్తువులను మాత్రమే తయారు చేసేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. దీన్నిబట్టి నిర్వాహకులకు సమాజం పట్ల, ప్రకృతి పట్ల ఎంత ప్రేమ ఉందో ఇట్టే అర్థమవుతోంది. ఇలా యేటా ఒక అంశాన్ని తీసుకొని పిల్లలకు అవగాహన కల్పిస్తున్నారు. వీటిలో ప్లాస్టిక్‌ను నిషేధించాలని ఒక సంవత్సరం, తల్లిదండ్రులను మమ్మీ, డాడీ అని కాకుండా అమ్మానాన్న అని మాత్రమే పిలవాలని మరో సంవత్సరం పిలుపునిచ్చారు. 13 సంవత్సరాల పాటు మమ్మీ డాడీ అని పిలిచిన ఓ పాప ఈ కార్యక్రమానికి వచ్చివెళ్లిన తర్వాత నుండి అమ్మా, నాన్న అని పిలుస్తోందని ఓ తండ్రి నిర్వాహకులకు ఫోన్‌చేసి సంతోషంగా చెప్పారంటే బాలోత్సవ్‌లో చేస్తున్న ప్రయోగాలు పిల్లల మనసుల్లో ఎంత బలంగా నాటుకుంటున్నాయో తెలిసిపోతోంది. చాటింగ్‌లు, ఎస్‌ఎంఎస్‌లు తప్ప ఉత్తరాలు రాయడం తెలియని నేటి బాలబాలికలతో ఉత్తరాల సంస్కృతిని పరిచయం చేయాలన్న తలంపుతో ఈయేడాది "తెలుగులో లేఖా రచన" అనే అంశాన్ని ప్రవేశ పెట్టారు. ఈ పోటీలో పాల్గొనే ప్రతి ఒక్కరూ ఇన్‌ల్యాండ్ లెటర్ తెచ్చుకోవాల్సి ఉంటుంది. దానిపై నిర్వాహకులు పోటీ సమయంలో ఇచ్చిన అంశాన్ని గురించి రాయవలసి ఉంటుంది. అలా రాసిన లేఖను పోస్టు చేయిస్తారు. ఆ విధంగా లేఖా సంస్కృతిని పరిరక్షించేందుకు పూనుకున్నారు. ప్రకృతి పరిరక్షించాలనే ఉద్దేశ్యంతో ప్రతి సంవత్సరం ఆర్.వెంకటయ్య అనే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి బాలోత్సవ్‌లో పాల్గొనేందుకు వచ్చిన ప్రతి పాఠశాలకూ ఒక మొక్కను ఉచితంగా అందజేస్తున్నారు. అంతరించి పోతున్న ప్రాచీన కళలను కూడా యేడాదికి ఒకటి చొప్పున ప్రదర్శిస్తున్నారు. వీటిలో భాగంగా గత యేడాది తోలుబొమ్మలాటను ప్రదర్శించగా బాలలు ఆశ్చర్యచకితులై తిలకించారు. ఈ మూడు రోజుల పాటు 'ప్రజాశక్తి బుక్‌హౌస్' ఆధ్వర్యంలో తెలుగుభాషా సాహిత్యం, పిల్లల కథలు, శాస్త్రవేత్తలు, సైన్స్‌కు సంబంధించిన అనేక పుస్తకాలు అందుబాటు ధరల్లో ఉంచడం విశేషం.

తప్పలను సరిదిద్దడం ప్రత్యేకత

కార్యక్రమం నిర్వహించడం... బహుమతులు ఇచ్చి వదిలేయడంతో తమ పని అయిపోయిందని చేతులు దులుపుకోలేదు వీరు. ఈ కార్యక్రమాలకు బెంగుళూరు, చెన్నై, తిరుపతి, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుండి ఆయా రంగాల్లో నిష్ణాతులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారు. వారు ఎంతో ఓర్పుతో పిల్లల ప్రతిభను గుర్తించి వారి తప్పులను కూడా నోట్ చేసుకుంటారు. ఏ విషయాల్లో తప్పులు చేస్తున్నారో ఆ తప్పులను వారికి వివరించడం, వాటిని కరెక్షన్ చేసి చెప్పడం

పోటీలోని సాంస్కృతికాంశాలు

1. చిత్రలేఖనం (స్పాట్ డ్రాయింగ్), 2. తెలుగు మాట్లాడుదాం, 3. లఘు చిత్ర సమీక్ష (షార్ట్ ఫిలిం రివ్యూ), 4. కవితా రచన, 5. చిత్ర విశ్లేషణ (పిక్చర్ ఎనాలసిస్), 6. కథా విశ్లేషణ, 7. క్విజ్, 8. కథారచన, 9. అనగా అనగా..(కథ చెబుతా వింటారా!), 10. భరతనాట్యం, 11. కూచిపూడి, 12. జానపద నృత్యాలు, 13. విచిత్ర వేషధారణ (ఫ్యాన్సీ డ్రస్), 14. లేఖా రచన, 15. సినీ, లలిత, జానపద గీతాలు, 16. వక్తృత్వం (తెలుగు/ఇంగ్లీషు), 17. వ్యర్థంతో అర్థం, 18. వాయిద్య సంగీతం (ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్), 19. గ్రూప్ డాన్స్, 20. నాటికలు.

నాలుగు అంశాలతో ప్రారంభమైన బాలోత్సవ్ నేడు 20 అంశాలను నిర్వహించే స్థాయికి చేరిందంటే పిల్లల నుండి, వారి తల్లిదండ్రుల నుండి వస్తున్న ప్రోత్సాహం అంతా ఇంతా కాదు. అందుకే బాలోత్సవ్ పిల్లల అభిరుచులకు అద్దంపడుతోంది.



ద్వారా పిల్లలను సుశిక్షితులుగా తయారు చేస్తున్నారు. మొదటిసారి ఈ కార్యక్రమాన్ని చూడడానికి వచ్చిన ఎంతో మంది విద్యార్థులు మరుసటి యేడాదికి ఏదో ఒక అంశాన్ని నేర్చుకొని కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్నారంటే బాలోత్సవ్ ఎంతగా స్ఫూర్తినిస్తుందో తెలుస్తోంది. చూచిరాత, డ్రాయింగ్ తదితర అంశాల్లో శిక్షణ తీసుకుని పాల్గొన్న అనేక మంది పిల్లలు బాలోత్సవ్‌ను చూసిన తర్వాతే తమలో ఈ ఉత్సాహం కలిగిందని సగర్వంగా చెబుతున్నారు. మొదట్లో పిల్లలుగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంతో మంది యువతులు నేడు తమ పిల్లలను ఇక్కడ ప్రదర్శనలో పాల్గొనేందుకు తీసుకు వస్తున్నారంటే బాలోత్సవ్‌తో వారు ఎంతగా పెనవేసుకున్నారో చెప్పకనే తెలుస్తోంది. ముఖ్యంగా కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం తదితర పట్టణాల్లో వాయిద్య సంగీతం (ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్) శిక్షణా కేంద్రాలు విపరీతంగా వెలిశాయి. పిల్లలు ఏదో ఒక వాయిద్యాన్ని నేర్చుకోవడం మనకు కనిపిస్తుంది.

వికలాంగుల కోసం...!

బాలోత్సవ్‌లో విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీయడంతో తమ పని అయిపోయిందను కోలేదు నిర్వాహకులు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఎంతో మంది వికలాంగులైన విద్యార్థులను చూసిన నిర్వాహకులు చలించిపోయారు. వీరి కోసం కూడా ఏమైనా చేయాలనే ఆలోచనకు పదునుపెట్టారు. ఆ క్రమంలోనే వికలాంగుల కోసం ఓ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గత ఏడేళ్ల నుండి వికలాంగుల కోసం జనవరి 26న కొత్తగూడెం క్లబ్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మానసిక, శారీరక అంగవైకల్యం గల వికలాంగులు ఈ కార్యక్రమంలో తమ ప్రతిభను కనబరుస్తున్నారు. వీరికి 8 అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 13 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. వికలాంగులైన విద్యార్థులు బడిని, ఇంటిని, తల్లిదండ్రులను మరిచిపోయి ఓ కొత్తలోకంలో విహరిస్తున్నారనడంలో అతిశయోక్తి లేదు.

20 అంశాలు..36 విభాగాలుగా పోటీలు

బాలోత్సవ్ 2010లో 20 అంశాలు, 36 విభాగాలుగా పోటీలు జరుగుతున్నాయి. పోటీ అంశాలు ఐదు వేదికలపై వరుసగా ప్రదర్శించ బడతాయి. ప్రతి విభాగంలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు, రెండు ప్రత్యేక బహుమతులు కేటాయించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ప్రతి పాఠశాలకూ "సర్టిఫికెట్ ఆఫ్ అప్రీసియేషన్"ను కూడా ప్రదానం చేస్తారు. గెలుపు ఓటములు పక్కన పెడితే పిల్లలు అంత మంది ముందు ప్రదర్శన ఇవ్వడం ఆనందించదగ్గ విషయం. అలా ఒక్కసారి వచ్చిన వారు మళ్లీమళ్లీ రావాలనే ఉత్సాహం చూపుతున్నారు.

ఫొటోల సేకరణ: డి. వెంకటేశ్వర్లు,
కొత్తగూడెం.

ఎంత వేగంగా తెల్లారుతుందా.. కొత్త చరిత్ర సృష్టించే తొలి ఉత్తర్వులు ఎప్పుడు విడుదల చేద్దామా ఇదే ధ్యాస లెనిన్‌ను పడుకోనివ్వడం లేదు. బ్లాక్ గదిలో దీపాలు ఆరిపోయాయనుకుని లేచాడు. కలం కాగితం తీసుకున్నాడు. 'ఒకటి' అని అంకె వేసి బ్రాకెట్ పెట్టాడు. మొదటి శాసనం ఏమిటి?

'ఈ క్షణం నుంచే భూస్వాముల ఆస్తి ఎలాంటి పరిహారం లేకుండా రద్దు చేస్తున్నాం. అవి ప్రజల పరమవుతున్నాయి'

ఆ అక్షరాలు రాస్తున్న సమయంలో ఆయనలో ఆలోచనా తరంగాలు!

"రష్యన్ రైతన్నా కూలన్నా ఈ రోజునుంచి మీరు స్వేచ్ఛా జీవులు. మీ శ్రమను, చెమటను పరులకు ధారపోయనవసరం లేదు. ఆవు పాలు దూడ తాగకుండా మధ్యలోనే ఆపేసే అవసరం లేదు. భూమి తల్లికీ స్వేచ్ఛ! స్వేచ్ఛ!!" ఆ పరమానందాన్ని చెప్పడానికి మాటలు లేవు.

ఈ ఉత్తర్వును లక్షల లక్షల ప్రతులు ముద్రించి వూరూరికీ పంపించాలి. ప్రతి రైతుకూ కూలికీ చేరాలి. ఇప్పటి వరకూ యుద్ధాలలో మునిగి తేలిన సైనికులే ఈ సమాచారం చేరవేసే వార్తాహరులు. ఒక వేళ వారు గనక ఈ కాగితాన్ని సిగరెట్ చుట్టడానికి వినియోగిస్తారేమో? ఆ అవసరం రాకుండా వారికి పాత క్యాలెండర్ ముక్కలు కావలసినన్ని ఇచ్చిపంపించాలి.

వేచిన వేకువ

లెనిన్‌కు ఆ రాత్రి నిద్ర పట్టడం లేదు. కాని చుట్టూ వున్నవాళ్ల కోసం నిద్ర నటిస్తున్నాడు. పక్కనే వున్న గదిలో దీపాలు ఆరిపోయినట్టు గుర్తించగానే లేచి కూచున్నాడు. కలం కాగితం తీసుకున్నాడు. ఆయన ఎప్పటినుంచో ఎదురు చూసిన అద్భుతమైన రాత్రి అది. దానికోసం జీవితమే అంకితం చేశాడు. అహరహం అహోరాత్రులు చదివాడు, రాశాడు, పోరాడాడు, నడిపించాడు, అజ్ఞాత వాసాలు చేశాడు, ప్రవాసాలు గడిపాడు.

హడావుడి పడే వాళ్లను ఆపి ఓపిగ్గా కృషి చేయించాడు.

అంతటివాడికీ ఆ రాత్రి ఓపిక పట్టడం మహా కష్టంగా వుంది!

అది అక్టోబరు 25 రాత్రి (క్యాలెండర్ మారిన తర్వాత ఇదే నవంబరు ఏడు కాబోతుంది). తెల్లవారితే తేదీ మారడమే కాదు, మానవ జాతి చరిత్రే మారిపోతుంది

★★★

ఆ రాత్రి రెండు సమావేశాలు జరుగుతున్నాయి. జారు చక్రవర్తిని జనం కూల్చేసిన తర్వాత మధ్యంతరంగా గద్దెక్కిన కెరెన్‌స్కీ ప్రతీఘాత మంత్రివర్గ సమావేశం వింటర్ ప్యాలెస్‌లో జరుగుతుంటే విప్లవానికి నాయకత్వం వహించిన బొల్షివిక్ పార్టీ కేంద్ర కార్యాలయం స్మోల్నిలో మరో సమావేశం జరుగుతున్నది. 'పారిపోవడమెలా?' అన్నది వింటర్ ప్యాలెస్‌లో చర్చ, 'పట్టుకోవడమెలా?' అన్నది స్మోల్నిలో చర్చ. అందుకోసం వింటర్ ప్యాలెస్ చుట్టూ చక్రవ్యూహం సిద్ధమైంది. రెండు భవనాల్లోనూ దీపాలు వెలుగులు జిమ్ముతున్నాయి కాని వాతావరణమే భిన్నంగా వుంది. ఒకచోట ఆరిపోనున్న దీపాల ఆఖరి వెలుగు. మరో వైపున జ్వాజల్యమానం కానున్న భవిష్యత్ కాంతి.

ఆ రాత్రి వింటర్ ప్యాలెస్‌ను హస్తగతం చేసుకోవాలన్నది బొల్షివిక్‌ల పథకం. యుద్ధనౌక అరోరా నుంచి సంకేతాలు రాగానే దాడి ప్రారంభం కావాలి. కాని ఈ లోగానే పని జరిగిపోయింది. కెరెన్‌స్కీ ప్రభుత్వం పతనమైంది. ప్రజా విప్లవ సైన్యాలు విద్రోహ మంత్రులందరినీ బందీలుగా పట్టుకున్నాయి. అతను మాత్రం మహిళా గార్డు వేషంలో ఎలాగో తప్పించుకుని పారిపోయాడు. మహిళలను పట్టుకోకూడదన్న సూత్రాన్ని బోల్షివిక్ సైన్యాలు పాటించాయి. అదే అదునుగా అమెరికా కారులో పారిపోయాడా ధూర్తుడు. అంతా విజయమేనని తెలియగానే విప్లవ సైన్యాలు దాంతో పాటే విశాల జన రాశులు ప్యాలెస్‌లోకి ప్రవాహంలా ప్రవేశించారు. జారు చక్రవర్తుల కాలం నాటి వింటర్ ప్యాలెస్ విలాసమయమై అలరారుతుంది. అవన్నీ చూడగానే కట్టలు తెగిన కోపంతో ఆ ఖరీదైన వస్తువులను ధ్వసం చేశారెవరో.

కామ్రేడ్! కోపం వద్దు. అవన్నీ ఇప్పుడు మన విప్లవ ప్రభుత్వ ఆస్తి. ప్రజల సంపద. వాటిని నాశనం చేయకండి. ఎవరో నివారించారు.

అరోరా ఫిరంగి ఇంతలో గర్జనలు చేసింది. వింటర్ ప్యాలెస్‌పై దాడికి సంకేతమది.

దానికి సందేశం వెళ్లింది.

కామ్రేడ్స్! దాడి చేయొద్దు. ప్యాలెస్ మన ఆధీనంలోకి వచ్చింది.

★★★

లెనిన్ వింటర్ ప్యాలెస్ పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వున్నాడు.

'ఈ ఆక్రమణలో మనకు జరిగిన నష్టమెంత?' అని ప్రశ్నించాడు.

"ఆరుగురు చనిపోయారు".

"లక్షలాది ప్రజలకు మహాద్భుత జీవితం అందించేందుకు ఆరుగురు ఆత్మార్పణ చేశారన్నమాట. అక్షరాలా వారు చిరంజీవులు. ప్రజల హృదయాల్లో నిరతం జీవించి వుంటారు" అన్నాడాయన ఉద్వేగంగా.

చరిత్రను సరిగ్గా అర్థం చేసుకుని సరైన సమయంలో విప్లవానికి సంకేతమిచ్చి విజయం సాధించి వుండకపోతే కెరెన్‌స్కీ ప్రభుత్వం వేల

ఆ రాత్రి వింటర్ ప్యాలెస్‌ను హస్తగతం చేసుకోవాలన్నది బొల్షివిక్‌ల పథకం. యుద్ధనౌక అరోరా నుంచి సంకేతాలు రాగానే దాడి ప్రారంభం కావాలి. కాని ఈ లోగానే పని జరిగిపోయింది. కెరెన్‌స్కీ ప్రభుత్వం పతనమైంది. ప్రజా విప్లవ సైన్యాలు విద్రోహ మంత్రులందరినీ బందీలుగా పట్టుకున్నాయి. అతను మాత్రం మహిళా గార్డు వేషంలో ఎలాగో తప్పించుకుని పారిపోయాడు. మహిళలను పట్టుకోకూడదన్న సూత్రాన్ని బొల్షివిక్ సైన్యాలు పాటించాయి. అదే అదునుగా అమెరికా కారులో పారిపోయాడా ధూర్తుడు. అంతా విజయమేనని తెలియగానే విప్లవ సైన్యాలు దాంతో పాటే విశాల జన రాశులు ప్యాలెస్‌లోకి ప్రవాహంలా ప్రవేశించారు. జారు చక్రవర్తుల కాలం నాటి వింటర్ ప్యాలెస్ విలాసమయమై అలరారుతుంది. అవన్నీ చూడగానే కట్టలు తెగిన కోపంతో ఆ ఖరీదైన వస్తువులను ధ్వంసం చేశారెవరో.

కామ్రేడ్! కోపం వద్దు. అవన్నీ ఇప్పుడు మన విప్లవ ప్రభుత్వ ఆస్తి. ప్రజల సంపద. వాటిని నాశనం చేయకండి. ఎవరో నివారించారు.

అరోరా ఫిరంగి ఇంతలో గర్జనలు చేసింది. వింటర్ ప్యాలెస్‌పై దాడికి సంకేతమది.



లక్షల మంది ప్రాణాలు తీసి వుండేదని ఆయనకు తెలుసు. స్మోల్నిలో సోవియట్ల రెండవ మహాసభలోనే ఆయన కార్మిక కర్షక విప్లవం జయప్రదమైందని ప్రకటించాడు. ఫిన్లండ్ కమ్యూనిస్టుపార్టీ స్థాపకుడైన ఇజ్జో రజా ఆ మాటలు విని పరవశించి పోయాడు. విప్లవ వైతాళికుని నోటనే విజయ వార్త వినడం ఎంత గొప్ప అవకాశం అని ఆనందతాండవం చేశాడు.

స్మోల్ని భవనం చుట్టూ కిక్కిరిసిన జన సమూహాలు. సహచరుడు స్వెర్డ్‌లోవ్ లెనిన్ పరిస్థితి గమనించాడు.దగ్గరగా వచ్చి చేయి పట్టుకున్నాడు.

“నీవు విశ్రాంతి తీసుకోవాలి వ్లదీమర్” అన్నాడు.

“ఈ భవనానికి దగ్గర్లోనే ఎక్కడన్నా వీలుంటే విశ్రాంతి తీసుకుంటాను” అన్నాడు అవిశ్రాంతనేత.

“మా ఇంటికొచ్చి పడుకో. నీ భార్య కృపస్కయా కూడా అక్కడకు చేరుకుంది” అని మరో చిరకాల మిత్రుడు బ్లాంక్ బయిలించ్ ఆహ్వానించాడు.

లెనిన్ విముఖంగానే అడుగులు వేశారు. మారు వేషాలలో సిద్ధహస్తుడుగా 110 రోజుల నుంచి పోలీసుల కళ్లు కప్పేందుకు విగ్గులు వేసుకుని సంచరిస్తున్నాడు. దాన్ని కిందకు లాక్కోబోయాడు. ఆ అవసరం లేదన్న మాట వెంటనే గుర్తుకువచ్చింది.

“ఈ అలవాట్లు ఒక్కసారిగా పోవు సుమా” అంటూ నవ్వుకున్నాడు.

బ్లాంక్ ఇంటికి చేరగానే లెనిన్‌కు మరో సంగతి గుర్తుకువచ్చింది.

“విభేదాలున్నా సరే ప్లెఖనోవ్ పట్ల జాగ్రత్తగా వుండాలి. మనవాళ్లు ఆయన్ను విప్లవ ప్రతీఘాతకుల జాబితాలో అరెస్టు చేస్తారేమో!” అన్నాడు ఆందోళనగా.

“ఆయన అనేకం వ్యతిరేకంగా రాసినా సరే, ప్రాథమిక విజ్ఞానాన్ని పెంపొందించిన మేధావి. ఇకముందు కూడా మనం నేర్చుకోవలసిన విషయాలుంటాయి. వెళ్లి ఆయన సంగతి చెప్పిరండి” అని పురమాయించాడు.

అంతటి ఉద్విగ్న క్షణాల్లో కూడా వివేచన నిల్పుకున్న లెనిన్ మేధస్సుకు అక్కడి వారు ముగ్ధులైనారు.

ఎట్టకేలకు ఆలోచనల సముద్రం లాంటి మెదడు స్విచ్ ఆఫ్ చేసినట్టుగా బూట్లు విప్పి పడుకున్నాడు లెనిన్.

అందరూ “హమ్మయ్య” అనుకున్నారు.

కాని ఆయనకు నిద్ర పట్టడం లేదు. వాళ్లకోసం నటిస్తున్నాడు. అందరి పరిస్థితి అలాగే వుంది.

★★★

ఎంత వేగంగా తెల్లారుతుందా.. కొత్త చరిత్ర సృష్టించే తొలి ఉత్తర్వులు ఎప్పుడు విడుదల చేద్దామా ఇదే ధ్యాస లెనిన్‌ను పడుకోనివ్వడం లేదు. బ్లాక్ గదిలో దీపాలు ఆరిపోయాయనుకుని లేచాడు. కలం కాగితం తీసుకున్నాడు. ‘ఒకటి’ అని అంకె వేసి బ్రాకెట్ పెట్టాడు. మొదటి శాసనం ఏమిటి?

‘ఈ క్షణం నుంచే భూస్వాముల ఆస్తి ఎలాంటి పరిహారం లేకుండా రద్దు చేస్తున్నాం. అవి ప్రజల పరమవుతున్నాయి’

ఆ అక్షరాలు రాస్తున్న సమయంలో ఆయనలో ఆలోచనా తరంగాలు!

“రష్యన్ రైతన్నా కూలన్నా ఈ రోజునుంచి మీరు స్వేచ్ఛా జీవులు. మీ శ్రమను, చెమటను పరులకు ధారపోయనవసరం లేదు. ఆవు పాలు దూడ తాగకుండా మధ్యలోనే ఆపేసే అవసరం లేదు. భూమి తల్లికీ స్వేచ్ఛ! స్వేచ్ఛ!!” ఆ పరమానందాన్ని చెప్పడానికి మాటలు లేవు.

ఈ ఉత్తర్వును లక్షల లక్షల ప్రతులు ముద్రించి వూరూరికీ పంపించాలి. ప్రతి రైతుకూ కూలికీ చేరాలి. ఇప్పటి వరకూ యుద్ధాలలో మునిగి తేలిన సైనికులే ఈ సమాచారం చేరవేసే వార్తాహరులు. ఒక వేళ వారు గనక ఈ కాగితాన్ని సిగరెట్ చుట్టడానికి వినియోగిస్తారేమో? ఆ అవసరం రాకుండా వారికి పాత క్యాలెండర్ ముక్కలు కావలసినన్ని ఇచ్చిపంపించాలి.

చుట్టుముట్టే ఆలోచనలు తమాయించుకోలేక తనలో తనే అణచుకోలేక లెనిన్ లేచాడు. అడుగుల చప్పుడు కాకుండా బయటికి నడిచాడు. బ్లాక్ గదిలోకి తొంగి చూశాడు. ఆయనా నిద్ర పోతేగా?

తర్వాతి గదిలో మేలుకుని వుంది భార్య కృపస్కయా.

“ఏమిటాలోచిస్తున్నావు?” అని అడిగాడు.

“ఒకటా... రెండా... చెప్పడానికి” అందామె ఉద్విగ్నంగా.

“నా పరిస్థితీ అంతే...” అంటూ దగ్గరగా కూచున్నాడు.

“ఔను ప్రభవించిన ప్రజారాజ్యం సోవియట్ యూనియన్ ప్రథమ శాసనం- లా- ఏమిటో వినాలని వుందా” సరదాగా అన్నాడు.

అంతలోనే ఆమె స్పందించింది. “లా శాసనం ఏమిటి? పాత ప్రభువుల పాపిష్టి పాలనను గుర్తుకు తెస్తుంది” అని ఆక్షేపించింది.

“అదీ నిజమే. మరేదైనా మాట.. ఆ దొరికింది. డిక్రీ అందాము.”

“అంటే”

“ఉత్తర్వు. ఫ్రెంచి విప్లవం నాటి మాట. అయితేనం చక్కగా అమరింది కదా” అన్నాడు లెనిన్

“నిజమే” అంటూ ఆయన చేతిలోని మొదటి డిక్రీ తీసుకుని చదివిందామె. కళ్లలో ఆనంద భాష్పాలు తొణికిసలాడాయి.

‘నిజంగానే అద్భుతమైన ఆరంభం’ అంది.

ఈ లోగా బ్లాక్ కూడా వచ్చి తన కామ్రేడ్స్ ఆనందంతో కలిశాడు.

ఆ అద్భుతమైన రాత్రి
కొత్త చరిత్ర మొదలైంది.

★

టెక్‌పేజ్

తాజా సమాచారమందించే ఆర్‌ఎస్‌ఎస్ ఫీడ్స్

ప్రపంచవ్యాప్తంగా ప్రతిరోజూ ఎన్నో సంఘటనలు చోటు చేసుకుంటుంటాయి. పత్రికలు, టీవీ ఛానెళ్ళు ఎన్నివున్నా కేవలం కొన్నింటిని మాత్రమే ఇవన్నీ మన దృష్టికి తీసుకొస్తుంటాయి. అయితే ప్రపంచం ఏ మూలనో జరిగే సంఘటనల వివరాలను అందించేందుకు న్యూస్ వెబ్‌సైట్లు పోటీపడుతుంటాయి. ఇటువంటి సైట్లను ప్రతిరోజూ మనం చూస్తూనే వుంటాం. ఇన్ని సైట్లలో ఏ సైట్లో ఏ సమాచారం కొత్తగా చేర్చారో తెలుసుకోవడం ఒకింత కష్టమే. అలాకాకుండా ఆ సైట్లే వాటిల్లో కొత్తగా ఏమన్నా చేర్చినప్పుడు, ఆ చేర్చిన సమాచారం మాత్రమే మనకు అందించేలా ఉంటే బావుంటుంది కదూ. ఖచ్చితంగా అదే పనిని ఈ RSS ఫీడ్లు చేస్తాయి. బ్లాగర్, బ్లాగ్ ఫీడ్‌లను స్వయంచాలకంగా ఉత్పన్నం చేయడానికి Atom ప్రమాణాన్ని వినియోగిస్తుంది.

కె.ఎక్స్.రాజు

అసలు ఆర్‌ఎస్‌ఎస్ అంటే ఏంటి? అందులో ఎన్ని రకాలున్నాయి? చానల్ గ్రూప్‌లను జత చేయడం ఎలా? ఆర్‌ఎస్‌ఎస్ అంటే ఏమిటి? అందుబాటులో వున్న రీడర్లు ఏంటి? వంటి వివరాలు...

ఆర్‌ఎస్‌ఎస్ అంటే ఏమిటి?

"Really Simple Syndication" అనే పదానికి సంక్షిప్త రూపమే RSS. ఫీడ్లను ఉత్పన్నం చేసే ప్రక్రియనే సిండికేషన్ అంటారు. ఎక్స్‌ఎంఎల్ ఆధారంగా పనిచేసే RSS వివిధ వెబ్‌సైట్లను విజిట్‌చేసి తేదీ, హెడ్డింగ్, లింక్‌ల ఆధారంగా ఆయా వెబ్‌సైట్లలో కొత్తగా ఏదైనా సమాచారం పొందుపరచబడిందేమో గుర్తిస్తుంది. కొత్త సమాచారం కన్పించిన వెంటనే Feed Demon వంటి ఆర్‌ఎస్‌ఎస్ రీడర్ సాఫ్ట్‌వేర్స్ ఈ సరికొత్త సమాచారాన్ని గురించి క్లుప్తంగా వివిధ ప్రోగ్రామ్‌లలో డిస్‌ప్లే చేస్తుంది. ఒకవేళ ఆ కొత్త సమాచారంలో ఏదైనా హెడ్డింగ్ మనల్ని ఆకట్టుకుందనుకోండి. దాన్ని క్లిక్ చేసిన వెంటనే నేరుగా ఆ న్యూస్ వున్న వెబ్‌పేజీ ఓపెన్ అవుతుంది. అంటే ఏ ఒక్క వెబ్‌సైట్‌నీ నేరుగా విజిట్ చేయకుండానే వాటిలో కొత్తగా చోటుచేసుకున్న సమాచారాన్ని మన డెస్క్‌టాప్‌పై తెలుసుకోవచ్చన్నమాట.

RSS Readersలో రకాలు...

RSS Feedలను సేకరించడానికి మన సిస్టమ్‌లో RSS Reader సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చెయ్యాలి. కొన్ని రీడర్లు సపరేట్ ప్రోగ్రాములుగానూ, మరికొన్ని రీడర్లు IE, Outlook వంటి ప్రోగ్రాములకు plug-insగానూ లభిస్తుంటాయి. ప్లగ్‌ఇన్‌లుగా దొరికే RSS Readerలను నేరుగా ఆయా పేరెంట్ అప్లికేషన్ నుండే ఉపయోగించవచ్చు. ఫైర్‌ఫాక్స్ బ్రౌజర్ ఉపయోగించే వారు బ్రౌజర్ టూల్స్ ఆప్షన్‌లోని యాడ్-ఆన్స్ నుండి 124రకాల ఆర్‌ఎస్‌ఎస్ ఫీడ్స్‌ను పొందవచ్చు. వీటిలో క్రికెట్ స్కోర్‌నుండి పిడిఎఫ్‌ల సెర్చ్ వరకు అన్నిరకాల సమాచారాన్నీ పొందవచ్చు. Feed Demon అనేది సపరేట్ అప్లికేషన్ మాదిరిగా పని చేస్తుంది. ఓపెన్‌సోర్స్‌లోనూ ఇటువంటి అప్లికేషన్స్ అనేకం వున్నాయి. వాటిలో RSSOwl ఒకటి. దీన్ని http://www.rssowl.org/ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

Channel గ్రూప్‌లను జతచేయడం :

దాదాపు అన్ని RSS రీడర్ సాఫ్ట్‌వేర్లలో పలు RSS ఛానెళ్ళు రెడీమేడ్‌గానే ఉంటాయి. సాధారణంగా ఆన్‌లైన్ న్యూస్‌ఐటమ్‌లను అందించే ప్రతీ వెబ్‌సైట్‌లోనూ RSS Feedsకి సంబంధించిన లింక్‌లు ఉంటాయి. మన సిస్టమ్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్న RSS Reader అప్లికేషన్‌లో కొత్త ఛానెల్‌ని జత చెయ్యాలంటే సింపుల్‌గా ఆ లింక్‌ని కాపీ చేసుకుని File>New>Channel అనే ఆప్షన్‌ని ఎంపిక చేసుకుని కాన్ఫిగర్ చేస్తే సరిపోతుంది. ఇకపై ఆ కొత్త ఛానెల్ సైతం RSS Reader లో వస్తుంది.

కావలసిన న్యూస్‌ని వెతకడానికి:

అనేక రకాల RSS ఫీడ్‌ల నుండి భారీ



మొత్తంలో న్యూస్ పేరుకుపోయినప్పుడు కేవలం మనకు కావలసిన న్యూస్‌ని మాత్రమే వెదికి పట్టుకోవడానికి ప్రతీ RSS Reader సాఫ్ట్‌వేర్‌లోనూ Search ఆప్షన్ ఉంటుంది. కొన్ని సాఫ్ట్‌వేర్లలో అయితే ఫీడ్ మన సిస్టమ్‌లోకి వచ్చే సమయంలోనే మనం పేర్కొన్న కీవర్డ్‌కి సంబంధించిన ఫీడ్ ఏదైనా వాటిలో ఉన్నట్లయితే వెంటనే మనకు సమాచారం అందించే సదుపాయం కూడా లభిస్తోంది.

అందుబాటులో ఉన్న రీడర్లు :

RSS ఫీడ్‌లను సేకరించడానికి అనేక సాఫ్ట్‌వేర్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో Awasu, Feed Demon, RSS Reader తదితరల సాఫ్ట్‌వేర్లు సిస్టమ్‌లో సపరేట్ ప్రోగ్రామ్‌గా ఇన్‌స్టాల్ అయి బ్యాక్‌గ్రౌండ్‌లో RSS Feedల నుండి సమాచారాన్ని సేకరిస్తుంటాయి. FeedDemon వంటివాటిని డబ్బు చెల్లించి కొనుక్కోవాల్సి వుంటుంది. ఇదే రకమైనపనిని మరింత మెరుగ్గా చేసే ఓపెన్స్ సోర్స్ సాఫ్ట్‌వేర్స్ కూడా నెట్‌లో లభ్యం అవుతాయి. విండోస్‌లో లభ్యమయ్యే సాఫ్ట్‌వేర్స్‌కు ప్రత్యామ్నాయంగా ఓపెన్‌సోర్స్ సాఫ్ట్‌వేర్స్‌ను http://www.osalt.com/ ఈ సైట్ నుండి పొందవచ్చు. ముఖ్యంగా ఆర్‌ఎస్‌ఎస్ ఫీడ్స్‌కు సంబంధించి RSSOwl, RSS Bandit వంటి సాఫ్ట్‌వేర్స్‌ను ఉపయోగించుకోవచ్చు. ఈ ప్రోగ్రాములు కేవలం RSS Feedలను మాత్రమే కాకుండా Blog సైట్ల నుండి blogలను సైతం సేకరించిపెడతాయి.

★

విశేషం

ఆయన కూడా లేరు...



ఎట్టకేలకు పిల్లలను పంపించేయడంతో కాస్త వూపిరి పీల్చుకోవచ్చని వసారాలోకి వచ్చింది సుభద్ర. పక్క వాటాలోంచి పద్మజ కూడా అప్పుడే తలుపు తీస్తున్నట్టనిపించి ఆగింది. నిజంగానే ఆమె తలుపు తెరచుకుని బయిటకు వచ్చి పలకరింపుగా నవ్వింది.

ఏమిటి లోపలే వున్నావా.. ఇంకా తలుపు వేసుంటేనూ నీవు లేవేమోననుకున్నా అంది సుభద్ర కలుపుగోలుగా.

లేదండీ.. ఇంట్లోనే వున్నాను. ఎక్కడికీ వెళ్లలేదు. ఆయన కూడా లేరు.

“లేరా” అని అడిగిన సుభద్రకు క్యాంపుకెళ్లారని చెప్పింది.

అంతవరకూ బాగానే వుంది. కాని తర్వాత మాట్లాడిన పది నిముషాలలోనూ పదిసార్లు “ఆయన కూడా లేరు” అనే మాట వినిపిస్తూనే వుంది. ఆ చెప్పడంలో జంకు, ఆందోళన దాచినా దాగకుండా తొంగి చూస్తున్నాయి.

చివరకు మాట ఆగని సుభద్ర అనేసింది “లేకపోతే ఏమిటి కొత్తగా ఈ రోజే చేరినట్టు మాట్లాడుతున్నావ్... చిన్న పిల్లవా తెలియని దానివా” అని..

“అదేం లేదనుకోండి..” కాని ఆయన వుంటే అదొక తీరు కదా..

“ఒక తీరు లేదు రెండు వూర్లూ లేవు. ఎంత భార్యాభర్తలైనా పిల్లలైనా అహోరాత్రులు ఏడాదిలో 365 రోజులూ కలసివుంటారా ఏం.. వంటరిగా వుండటం, మామూలుగా పనులు చూసుకోవడం అలవాటు చేసుకోవాలి గాని” అని సలహా ఇచ్చేసి ఇంట్లోకి వచ్చింది.

★★★

సుభద్ర పెద్దగా చదువుకోలేదు గాని పద్మజ బిఎ పూర్తి చేసింది. ఇప్పుడు కూడా ఏవో పరీక్షలు కడుతుంటుంది. ఇంగ్లీషు మాట్లాడుతుంది. అలాటి వ్యక్తి వూరికే భయపడటం ఏమిటా అని సుభద్రకేమీ ఆశ్చర్యం కలగలేదు. ఎందుకంటే ఇలాటి వారిని చాలామందిని చూసింది. చాలా గంభీరంగా అందంగా నాగరికంగా వుండే ఆడవాళ్లు కూడా వూరికే భయపడి పోవడం, తోడుంటేనే తప్ప కదలక పోవడం ఆమెకు తెలుసు. ఏదో పరాధీన మనస్తత్వం వారిని పట్టిపీడించడం ఆమె గమనించింది. కాని ఇంకో వైపున చూస్తే ఇళ్లలో పని చేసేవారు, వీధుల్లో కూరలమ్మే వారి వంటి అతి సామాన్య స్త్రీలు కూడా నిర్భయంగా దూసుకుపోవడమూ గమనిస్తుంటుంది.

దీనంతటికీ కారణం సామాజికంగా చిన్నప్పటి నుంచి పడిన ప్రభావాలే కారణమని ఆమె ఇంగితజ్ఞానానికి ఎప్పుడో అర్థమైంది. తన వరకూ తాను వంటరిగా తెలిసిన ఏ చోటుకైనా వెళ్లిరావడం ఏ పనైనా స్వంతంగా సవరించుకోవడం అలవాటు చేసుకుంది. తెలియని చోటికి వెళ్లాలంటే ముందే ఇంట్లో వాళ్లను పదిసార్లు అడిగి తెలుసుకుంటుంది. కాస్త జాగ్రత్తగానూ సంచరిస్తుంది. అంతే. ప్రతి కుటుంబంలోనూ సుభద్రలూ పద్మజలూ మనకు కనిపిస్తూనే వుంటారు. ఆమె అనుకున్నట్టే పెంపకంలో అనుసరించిన పద్ధతులే వారిలో భయాన్ని సృష్టిస్తాయి. సామాజిక పరిస్థితులు దాన్ని మరింత తీవ్రం చేస్తాయి. ఎందుకంటే రోజూ ఆడపిల్లలపై అఘాయిత్యాలు, మహిళలపై దాడుల వంటి వార్తలు చూస్తున్న కొద్దీ ఈ భయం కొనసాగడమే గాక ఇంకా పెరుగుతుంటుంది. అలాటి సందర్భాలలో ఎవరూ తోడు రాలేదని తర్వాత కూడా ఎవరూ సానుభూతి చూపించలేదని వినడంతో భయం ఇంకా పెరిగి పెరిగిపోతుంది.

ఒకవేళ పతి దేవుడు లేదా మరో పురుష పుంగవుడు తోడున్నంత మాత్రాన ఏ సమస్యలూ ఎదురవవని పూచీ ఏమీ లేదు. మరీ అమానుషమైన పరిస్థితులే వస్తే స్త్రీ పురుష తేడా లేమీ పని చేయవు. ధైర్యసాహసాలు సమయస్ఫూర్తి మాత్రమే ఎవరికైనా ఎక్కడైనా తోడుంటాయి. జాగ్రత్తలు చెప్పవలసిందే గాని భయం నూరిపోయకూడదు. దానికి బదులు సహాయస్ఫూర్తిని పెంపొందించాలి. సమాజ పరిస్థితులనుబట్టి అమ్మాయిలకు మరింత ఎక్కువగా దాన్ని అందించాలి.

స్త్రీలు తమను తాము రక్షించుకోలేరు అనడం కంటే రాదు అన్న భావన సమాజంలో పాతుకు పోవడం కూడా ఇందుకో కారణం. రాముడే సీతకు రక్షణ (అయినా రావణుడు ఎత్తుకుపోయాడు) అన్నట్టు అనుక్షణం కుటుంబ సభ్యుల నీడలో మనుగడ అయితే ఏ భయం వుండదన్నది ఒక భ్రమ. చిన్నపిల్లాడినయినా వెంట వేసుకుని పోవలసిందేనన్నది పాత భావన. ఇప్పుడు కొంత వరకూ మారింది. అమ్మాయిలు తాముగానే సంచరించడం కనిపిస్తుంది. కాని వారిలో ధైర్యం మోతాదు ఎంత అని పరిశీలిస్తే చాలా నామమాత్రం. అన్నీ ‘లైట్ తీసుకో...’ అంటూనే భయాన్ని మాత్రం భారీగానే పోషిస్తూ అదే భద్రత అని పొరబడుతుంటారు. చిన్ని ఘటనతో కకావికలై పోతారు. సమాజంలో ధోరణులు కూడా అలాగే వుండటంతో వారి భయాందోళనలు మరింత భారంగా మారుతుంటాయి. భయం లేకుండా వుండమని చెప్పడం తేలికే గాని నిర్మూలించడం అంత తేలిక కాదు.కారణం దాని వేళ్లు చాలా లోతుగా పాతుకుని వుంటాయి.కనకనే కుటుంబాలలో మాట్లాడేప్పుడు నిర్ణయాలు తీసుకునేప్పుడు భయాన్ని గాక ధైర్యాన్ని పెంచే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతిమాట అమ్మాయిల్లో సమానతా భావనను పెంచేదిగా వుండాలి తప్ప తక్కువతనాన్ని సృష్టించకూడదు. తక్కువ తనం అన్న భావనే పరాధీనతకు దారి తీస్తుంది. ఇదో విష వలయం అవుతుంది. కనకనే అమ్మాయిల పెంపకంలో చిన్నప్పటి నుంచే జాగ్రత్త తీసుకోవాలి.

ఒక బ్యూటీ క్రీం అడ్వర్టయిజ్‌మెంట్ వస్తుంటుంది. షారుక్ ఖాన్ నటిస్తాడు. ‘మగాడివై వుండి ఆడపిల్లల క్రీమా వారి చర్మం కోమలం కోమలం నీ చర్మమో రఫ్ అండ్ టఫ్’ అని పాడతాడు. చాలామందిలో ఇదే భావం తిష్ట వేసుకుని వుంటుంది. వాస్తవం ఏమంటే మరీ కాయకష్టం చేసేవారిని మినహాయిస్తే ఎక్కువ సందర్భాల్లో ఆడవాళ్లే రఫ్ అండ్ టఫ్‌గా పని చేస్తారు. జీవిత భారం మోస్తారు. పిల్లలను కనడం దానికదే ఒక పునరుజ్జీవం వంటిది. ఇవి గాక సమాజంలో వివక్షతలు వికృతాలు సరే సరి. సాధారణంగా భర్త కన్నా భార్య వయస్సు తక్కువగా వుంటుంది. కొన్ని తరాలపాటు బాల్య వివాహాలు కూడా జరిగాయి. ఈ అన్ని సందర్భాల్లోనూ కష్టాలు పడింది మహిళలే తప్ప పురుషులు కాదు. అలాటిది వారు కోమలం అని పురుషుడేదో రఫ్ అండ్ టఫ్ అని భావించడం ఒక పొరబాటు. మన మాటలు చేతల ద్వారా ఈ భావాన్ని ఆడవారిలో అంతర్భాగంగా చేయడం అంటే ఇంగ్లీషులో ఇంటర్నలయిజ్ చేయడం మరింత పొరబాటు. నేను రాకపోతే ఏం నీవుండొచ్చు అని చెప్పే బదులు ఏవో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం, తోడు తెచ్చి పెట్టడం ఇవన్నీ కూడా వారి వ్యక్తిత్వాలపై శక్తిత్వాలపై వారి నమ్మకాన్ని దెబ్బతీస్తాయి.

అభిమానం వల్ల గాని ఆందోళన వల్లగాని ఆడపిల్లల్లో అభద్రతను పెంచడం జరక్కపోతే చాలా దుర్మార్గాలను వారు ధైర్యంగా ఎదుర్కొనగలుగుతారు. అలా చేసిన వారిని సమాజం గౌరవించడం కూడా అవసరం. కుటుంబాలలో వారిని ప్రత్యేకంగా మార్గదర్శకంగా నిలబెట్టాలి. ఇల్లాలి చదువు ఇంటికి వెలుగే కాదు ఇల్లాలి ధైర్యం ఇంటికి రక్ష అన్న భావన పెంపొందించాలి. భార్యలలో లేదా కూతుళ్లలో తోబుట్టువులలో అమ్మాయిలు గనక అభద్రతను పెంచడం ఎలాటి అభిమానానికి నిదర్శనం కాదని ప్రతివారూ తెలుసుకుంటే సమస్య సగం తగ్గుతుంది. తల వంచుకుని వెళ్లే మహిళలనూ తలెత్తుకు తిరిగే, ఎదురు తిరిగే మహిళలను ఒకే విధంగా చూడటం జరగదు. పురుషుల ఆభిజాత్యాన్ని సంతృప్తి పరచడం కోసం వారిపై ఆధారపడినట్టు వ్యవహరించే ధోరణిని స్త్రీలు కూడా మార్చుకోవాల్సి వుంటుంది. ఈ విషయంలో కొత్తతరం విద్యాధిక యువతులైనా ముందడుగు వేస్తారని ఆశించాలి.

- భారతి

ఎవరి ఆహారం ఏది?

మరి గుర్తించి ఆహారాన్ని, ప్రాణిని కలిపేయండి.

ఏమేం జీవులున్నాయి?





చుక్కలు కలిపేద్దాం

బాతు బొమ్మ గీసేద్దామా...



మొత్తం ఎన్ని?

నేస్తాలూ ... ఇక్కడ బోలెడన్ని బొమ్మలున్నాయా? అయితే వీటిలో ఆంగ్ల అక్షరం 'టి'తో మొదలయ్యేవి ఎన్ని? వాటి పేర్లేంటి?

ఏ ము క దొ రి కే నా!



ఏ రోజు?

పైనున్న బొమ్మల తొలి అక్షరాలను (ఆంగ్లంలో) వరుసగా రాస్తే ఏ రోజో వస్తుంది?

మొత్తం ఎన్ని మొహాలున్నాయోచ్



జవాబు: 7

మాటల కోట - 26

రూపకల్పన : వెంకట సుబ్బారావు కావూరి

1	2		3	■	4		5	6
7		■	8	9		■	10	
11			■		■	12		
■		■	13	■	14	■		■
15	■	16					■	17
■	18	■		■		■	19	■
20			■	21	■	22		23
24		■	25		26	■	27	
28				■	29			

అడ్డం :

1. తర్వాతి తరం వాళ్లు. ఇప్పుడు సినిమా, రాజకీయ రంగాల్లో ఈ పద్ధతి సాగుతోంది (4)
2. మామిడిలో ఇదో రకం. చిత్తూరు ప్రాంతంలో ప్రాప్తం (4)
7. ఆలస్యం దారి మార్చింది (2)
8. ఇది బూట్లకు జోడు (3)
10. అడ్డం తిరిగిన చెలికత్తె. ఏమి హాయిలే అంటూ సాగే తెలుగు పాటలో ప్రాచుర్యం పొందిన మాట (2)
11. అటు నుంచి ఇటు నడిచిన ముద్దుల మనుమరాలు కామాక్షిని వాళ్ల బామ్మ ఇలా ముద్దుగా పిలుస్తుంది. మన్మధుడు అని కూడా (3)
12. కొంచమే అని (3)
15. తెలుగు పిల్లలకి ఈ అక్షరంతో చదువును ప్రారంభిస్తారు (1)
17. గ్రామ సింహం ఇలా అరిచిందో కొందరు పరుగో పరుగు (1)
20. ప్రమాదం (3)
22. ఆడంబరం. పైన ఇది లోన లొటారం అని తెలుగు సామెత (3)
24. చేపల్ని, జంతువుల్ని, పక్షుల్ని పట్టేందుకు వినియోగిస్తారు. ఇక్కడ అడ్డం తిరిగిందనుకోండి (2)
25. కష్టాలు (3)
27. నిలువు ఇరవై మూడేగానీ తోక భాగం తెగింది (2)
28. విధాన రూపకల్పన పెడమార్గం పట్టింది (4)
29. క్రమం తప్పిన, తలకిందులయిన (4)

నిలువు :

1. అతిగా మాట్లాడటం (3)
2. తెలంగాణ సాయుధ పోరాటకాలంలో నవాబు సొంత సైన్యం (4)
3. మంచి కింద నుంచి పైకి పోయింది (2)
4. వెంట ఉండువారు, పాలు పేరుకునేందుకు వేసే మజ్జిగ (2)
5. గగుర్పాటు, సంతోషం (4)
6. పచ్చదనం, అడవి ఎటెటో పోయింది (3)
9. సన్యాసి, బిక్షగాడు, వాడూవాడూ రాసుకుంటే బూడిద రాలిందని నానుడి (2)
13. మరణం లేనిది (3)
14. మార్గం, సమస్య నుంచి బయటపడేసే దారి (3)
18. వినాయకచవితికి తోడు కాలుష్యానికి కారణమయ్యే పండుగ. జేబులకు దండగ (4)
19. కొత్తగా ఆకు వేయటం. మారాకు కిందనుంచి సాగిందంతే (4)
20. మౌనంగా నిరసన తెలపటం (3)
21. అక్క, కొన్ని ప్రాంతాల్లో ఇలా పిలుస్తారు. కర్నాటకలో అందరి పేర్లకూ దీన్ని తగిలించి పిలుస్తారనుకోండి (2)
23. రక్తం కింద నుంచి పైకి కారింది. (3)
25. కింద నుంచి వస్తువు, ఒక పుస్తకం, వ్యతిరేక విశేషణం (2)
26. తప్పగింజ పైకి పోయింది. లోపలి భాగంలేని విత్తు (2)

మాటలకోట - 25 జవాబు

1 స	2 ర	దా	■	3 వా	■	4 ద	5 రు	6 వు
7 క	ట్టు	■	8 పాం	లి	9 గ	■	10 పో	క
లం	■	11 రా	దు	■	12 ని	13 న్న	■	రు
■	14 మా	త	■	15 శ	■	16 అ	17 ట్టు	■
18 జో	రు	■	19 మి	త్రు	డు	■	20 క	సి
■	21 తి	22 మూ	■	వు	■	23 జా	తా	■
24 అ	■	25 ర	26 ప	■	27 మ	లి	■	28 లు
29 ద	30 స్తం	■	31 త్రి	32 పు	ర	■	33 క	ప్ప
34 నం	వ	ద	■	రం	■	35 గ	ల్లం	తు

తారా తీరం

తారలంటే అందరికీ ఇష్టమే. ఆకాశంలో మెరిసే తారలైనా...వెండితెరపై మురిపించే తారలైనా. పిల్లలు-పెద్దలు, ధనికులు-పేదలు, నాటు-నీటు, ఆడ-మగ బేధాలు లేకుండా ఇష్టపతారు వీరిని. తమ ఆరాధ్య తారల సినిమా విడుదలైందంటే... అభిమానుల్లో అలజడే. తొలిరోజు తొలి ఆట చూసి తీరాల్సిందే. రద్దీకి చొక్కాలు చిరిగినా, చెప్పలు తెగినా... తొలి ఆట టికెట్ సంపాదించాల్సిందే. తమ ఆట, పాట, అందం, అభినయంతో కట్టిపడేసే స్టార్లు "చిన్నతనంలో ఎలా వుండేవారబ్బా?" అని అనిపిస్తుంటుంది ఒక్కోసారి. మరి మీ అభిమాన తారాగణం చిన్ననాటి ఫొటోలు మీ ముందుకొస్తే... చూసి మురిసిపోరూ. మరైతే ఆలస్యమెందుకు!

Multislice CT Scan
Ultrasound
Digital X-Ray
Dental OPG
ఏపెక్స్
డయాగ్నస్టిక్ సెంటర్
డా॥ ఎ.వి.గిరీష్
షుగర్ వ్యాధి నిపుణులు
డా॥ స్వప్న
దంత వైద్య నిపుణులు
డా॥ డి.రాజ్‌కిరణ్
కీళ్ళ వ్యాధి నిపుణులు
డా॥ జి.శివకుమార్
క్యాన్సర్ వ్యాధి నిపుణులు
ల్యాబ్, స్కానింగ్, డిజిటల్ X-రే
శోధన్ పెయింట్స్ కాంప్లెక్స్, యస్.బి.ఐ. ఎదురుగా, వైరారోడ్, ఖమ్మం. ఫోన్ : 08742- 225555, 653455
Olympus AU 400 Biochemistry Analyser
Blood Gas Analyser
(ABG)
Five part Cell Couter
(Beckmen Coulter)
Coagulometre
(PT, APTT, Fibrinogen)

మంచి భవిష్యత్తుకు కావాలి - మంచి ఉద్యోగం, మంచి ఉద్యోగానికి కావాలి - మంచి విద్య
మంచి విద్యకు కావాలి - మంచి విద్యా సంస్థ, అలాంటి మంచి విద్యాసంస్థకు గుర్తింపు
"పూర్వ విద్యార్థుల సంతృప్తి, ప్రశంసలే"
ESTD : 1996
SOFTECH
COMPUTERS
WARANGAL HANAMKONDA KISHANPURA
Cell: 98 660 550 44
తెలంగాణాలోకెల్లా అతి పెద్ద కంప్యూటర్ విద్యాసంస్థ